




ఉష్ణోగ్రత (అంచనా) 31-5-2025

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| గుంటూరు | 37 | 28 |
| తెనాలి | 36 | 28 |
| నరసరావుపేట | 38 | 28 |
| బాపట్ల | 37 | 28 |
| రెంటచింతల | 40 | 29 |
| చీరాల | 37 | 28 |



# సన్నబియ్యంతో భోజనం

- మధ్యాహ్న భోజనంలో మార్పులు
- సంక్షేమ హాస్టళ్లలోనూ పంపిణీకి ఏర్పాట్లు
- పౌరసరఫరాల శాఖకు ఇండెంట్ పంపిన విద్యాశాఖ
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో పదివేల ఎంటీల సేకరణ
- బియ్యం పక్కదారి పట్టకుండా నేరుగా కళాశాలలు, పాఠశాలలకే పంపిణీ



గుంటూరు(విద్య), మే 30 (ఆంధ్రజ్యోతి): దొడ్డ బియ్యంతో మధ్యాహ్న భోజనం తినలేక విద్యార్థులు ఇంతకాలం అల్లాడి పోయారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందజేస్తున్నా.. చాలామంది ఇళ్ల నుంచి క్యారేజీలు తెచ్చుకుంటున్నారు. కూటమి ప్రభుత్వ పరిశీలనలో సన్నబియ్యంతో అయితే భోజనం చేస్తామని విద్యార్థులు చెప్పారు. దీంతో రానున్న విద్యా సంవత్సరం నుంచి మధ్యాహ్న భోజనంలో మార్పులు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ పరిస్థితుల్లో మధ్యాహ్న భోజన పథకానికి ఇక నుంచి (మిగతా 4వ పేజీలో)

# జల్‌జీవన్..జాగు

- గ్రామీణులకు అందని స్వచ్ఛజలం
- అట్టడుగున పల్నాడు, బాపట్ల జిల్లాలు
- నిధులున్నా పనుల నిర్వహణలో నిర్లక్ష్యం
- గడువుదాటి ఏడాదైనా అరకొరగానే పనులు
- మూడు జిల్లాల్లో 54 గ్రామాల్లోనే నూరుశాతం కుళాయిలు

2024 మార్చి కల్లా ప్రతీఒక్కరికీ స్వచ్ఛమైన తాగునీరు అందించాలి. గ్రామాల్లోని తాగునీటి పథకాలను పూర్తిస్థాయిలో పునరుద్ధరించి నూరుశాతం ఇళ్లకు కుళాయిల ద్వారా రక్షిత మంచినీటిని సరఫరా చేయాలి. పల్లెల్లో ప్రతి వ్యక్తికి 55 లీటర్లు నీరు ఇవ్వాలి.. అనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జల్‌జీవన్ మిషన్ పనుల్లో ఆరేళ్లుగా జాప్యం జరుగుతోంది. దీంతో పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో కేంద్ర ప్రభుత్వం లక్ష్యం నీరుగారి పోయింది. ఇప్పటికీ పనులు నత్తనడక కన్నా నిదానంగా సాగుతున్నాయి. వందల సంఖ్యలో పనులకు టెండర్లు కూడా నిర్వహించలేదంటే పనులపై అధికారుల్లో ఏపాటి శ్రద్ధ కనిపిస్తోందో అర్థం చేసుకోవచ్చు. ఉన్న పథకాలను విస్తరించడంతో పాటు, పైపులైన్లు, నీటి నిల్వ చెరువుల అభివృద్ధి తదితర పనులు చేపట్టాల్సి ఉంది. ఎన్నికలకు ముందు ప్రతి ఇంటికి కుళాయి ద్వారా స్వచ్ఛజలం అందిస్తామని ఇచ్చిన హామీని అమలు చేసే దిశగా చర్యలు చేపట్టడంలో పాలకులు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.





గండిగనుమల గ్రామంలో నీటి కోసం పాట్లు

కుళాయిలు ఇలా..

| జిల్లా | మొత్తం గృహాలు | కుళాయిలున్నవి | లేనివి | శాతం |
|---|---|---|---|---|
| పల్నాడు | 4,34,399 | 1,54,243 | 2,80,156 | 35.51 |
| గుంటూరు | 2,33,883 | 1,58,407 | 75,476 | 67.73 |
| బాపట్ల | 3,64,788 | 1,48,980 | 2,16,808 | 40.67 |
| మొత్తం | 10,33,070 | 4,61,630 | 5,72,440 | 44.68 |

### 44.68 శాతమే పూర్తి

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 10,33,070 గృహాలు ఉండగా ఇప్పటి వరకు 4,61,630 గృహాలకు మాత్రమే కుళాయిల ద్వారా నీటి సరఫరా జరుగుతున్నది. అంటే 44.68 శాతం గృహాలకు మాత్రమే కుళాయిలు ఉన్నా అవి నామమాత్రంగానే ఉన్నాయి. ఇంకా 5,72,440 గృహాలకు కుళాయి కనెక్షన్ ఇవ్వాలి. ఈ పథకం ప్రారంభం నుంచి ఇప్పటికి గుంటూ రు, పల్నాడు, బాటప్ల జిల్లాలో 54 గ్రామాల్లో మాత్రమే నూరుశాతం ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇవ్వగలిగారు. తాగునీటి పథకాలు, చెరువుల అభివృద్ధి, పైపులైన్ల పునరుద్ధరణ, కుళాయి కనెక్షన్లు పనులు ఆరేళ్లుగా అరకొరగానే సాగుతున్నాయి.


(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పాలకుల నిర్లక్ష్యం.. అధికారుల్లో అశ్రద్ధ.. ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు ప్రశ్నార్థకంగా మారింది. ఇంటింటికి రక్షిత నీటిని అందించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 2019లో జల్‌జీవన్ మిషన్‌ను అమల్లోకి తీసుకొచ్చింది. ఆరేళ్ల అవుతున్నా ఇప్పటికీ సగం ఇళ్లకు కూడా కుళాయిల కనెక్షన్లు ఇవ్వలేదు. ఉన్న తాగునీటి పథకాలను, చెరువులను అభివృద్ధి చేయలేదు. జలజీవన్ మిషన్ కింద తాగు నీటి పథకాల అభివృద్ధి నత్తనడకన సాగుతోంది. జల జీవన్ అమలులో పల్నాడు, బాపట్ల జిల్లాలు రాష్ట్రంలోనే అట్టడుగున నిలిచాయి. ప్రతి గ్రామంలో నూరు శాతం కుళాయిల ద్వారా నీరు సరఫరా చేసేందుకు రూ.1021.38 కోట్ల అంచనాతో పనులు చేపట్టినా గతంలో, ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యాల కారణంగా పనుల్లో తీవ్ర జాప్యం చోటుచేసుకుంది. కేంద్రం తన వాటాలో సుమారు రూ.275 కోట్లు విడుదల చేసింది. ఈ నిధులను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించడంతో పనులు (మిగతా 4వ పేజీలో)

## కార్యాలయాలన్నీ ఒకే ప్రాంగణంలో

### అందుబాటులో 19 ఎకరాలు.. అధికారుల కసరత్తు

అద్దంకి, మే 30 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకే ప్రాంగణంలో ఏర్పాటుకు కసరత్తు ప్రారంభమైంది. అద్దంకి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే ఒకే ప్రాంగణంలో డివిజన్ స్థాయి కార్యాలయాలు ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేయాలని అధికారులు భావిస్తున్నారు. గతంలో పెద్దఎత్తున ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్నా అవి ప్రస్తుతం ఆక్రమణలకు గురై ఉన్నాయి. ప్రస్తుతం ఏ ప్రభుత్వ కార్యాలయం ఏర్పాటు చేయాలన్నా అందుబాటులో స్థలం లేని పరిస్థితి. రెవెన్యూ డివిజన్‌గా ఏర్పడితే పలు అనుబంధ కార్యాలయాలు అద్దంకి వచ్చే అవకాశం ఉంది. 100 పడకల ఆస్పత్రి మంజూరుకు కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయి. అద్దంకి నగరపంచాయతీగా మార్పు చేసినపుడు భవన నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు కాగా సరిపడా స్థలం అందుబాటులో లేక ఇంకా నిర్మాణం చేపట్టలేదు. కార్యాలయాలన్నీ ఒకే దగ్గర ఏర్పాటు చేస్తే ప్రజలకు సౌకర్యవంతంగా ఉండే అవకాశం ఉందని, ఇందుకు కొండయ్య కుంట మాన్యం భూమిని పరిశీలించాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించినట్లు సమాచారం. సుమారు రెండున్నర దశాబ్దాల క్రితం అద్దంకి-రేణింగవరం దారిలో చెరువుకొమ్ముపాలెం క్రాస్ రోడ్డు వెంబడి దేవదాయశాఖకు చెందిన సుమారు 19 ఎకరాల కొండయ్య కుంట మాన్యం భూమిని ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వం కొనుగోలు చేసింది. అయితే అద్దంకి దూరంగా ఉన్న ఈ భూమి మధ్యలో వాగు ప్రవహిస్తుండటంతో ఇళ్ల స్థలాల పంపిణీ నిలిచిపోయింది. దీంతో కార్యాలయాలన్నీ ఈ ప్రాంగణంలో ఏర్పాటుకు అనువుగా ఉంటుందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.



# ఇద్దరికి కరోనా

- తెనాలి, ఉండవల్లిలో కేసుల గుర్తింపు
- జీజీహెచ్‌లో ప్రత్యేక ఓపీ, ఐసోలేషన్ వార్డు
- సమృద్ధిగా ప్రాణవాయువు నిల్వలు సిద్ధం



గుంటూరు మెడికల్, మే 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు కొవిడ్-19 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. తెనాలి, ఉండవల్లిలో ఇద్దరికి కరోనా సోకినట్లు గుంటూరు డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి శుక్రవారం ప్రకటించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రైవేటు వైద్యశాలల్లో కొవిడ్ కేసులు వెలుగు చూస్తున్న నేపథ్యంలో గుంటూరు ప్రభుత్వాస్పత్రి క్యాజువాల్టీ సమీపంలో ప్రత్యేక ఓపీ ఏర్పాటు చేశారు. రోగుల నుంచి నేసల్ స్వాబ్స్ సేకరించి వ్యాధి నిర్ధారణ కోసం ర్యాపిడ్ కిట్ పరీక్షలు, ఆర్‌టీపీసీఆర్ పరీక్షలు చేస్తున్నారు. కరోనా పాజిటివ్ కేసులు నమోదైతే, రోగుల చికిత్సల కోసం బీ క్లాస్ వార్డులో 15 పడకలతో ఐసోలేషన్ వార్డును కూడా ఏర్పాటు చేశారు. వార్డులో వెంటిలేటర్లతో పాటు ఆక్సిజన్ కాన్సంట్రేటర్లను సిద్ధం చేశారు. రాష్ట్రంలోనే అత్యధికంగా 30 వేల లీటర్ల నిల్వ సామర్థ్యం ఉన్న లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్లు జీజీహెచ్‌లో సిద్ధం చేశారు. పెద్ద సంఖ్యలో రోగులు చేరినా ప్రాణవాయువు అందించేందుకు సిద్ధమని జీజీహెచ్ (మిగతా 4వ పేజీలో)

## నేడే పింఛన్లు

- ఒకరోజు ముందు పంపిణీకి ఏర్పాట్లు
- మూడు జిల్లాలకు రూ.321.89 కోట్లు విడుదల
- ఎంపికైన వితంతువులకు 12న స్పౌజ్ కోటాలో..

బాపట్ల, మే 30 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ ఈసారి ఒకరోజు ముందుగానే లబ్ధిదారులకు అందనుంది. జూన్ 1 ఆదివారం. దీంతో శనివారం మే 31న పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తొలి నెలలోనే రూ.వెయ్యి పెంచి రూ.4 వేల చొప్పున పింఛను ఇస్తుంది. పైగా ఇచ్చిన మాట ప్రకారం ప్రతి నెలా ఒకటో తేదీ, ఆ రోజు సెలవు అయితే ముందు రోజే సచివాలయాల సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వచ్చి పంపిణీ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వం ఒకరోజు ముందుగానే పింఛను అందజేసింది. కిందటేడాది సెప్టెంబరు, డిసెంబరు నెలల్లో ఒకటో తేదీ ఆదివారం, జనవరి 1 సెలవు కావడంతో ముందురోజే లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ క్రమంలో ఈ నెలలోనూ ఒకరోజు ముందే పింఛన్ల పంపిణీ చేయనున్నారు. గుంటూరు జిల్లాలో 2,51,280 మంది పింఛనుదారులకు సంబంధించి రూ.109.02 కోట్లు, పల్నాడు జిల్లాలో 2,70,234 మందికి రూ.117.87 కోట్లు, బాపట్ల జిల్లాలో 2,25,787 మందికి రూ.95 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. ఆ నగదును ఇప్పటికే సచివాలయ సిబ్బంది డ్రా చేసుకుని పంపిణీకి సిద్ధం చేసుకున్నారు. శనివారం తెల్లవారుజామునే లబ్ధిదారులను స్వయంగా కలిసి ఇవ్వనున్నారు.

**వితంతవులకు కొత్తగా..**

పింఛన్ పొందుతూ 2023 డిసెంబరు 1 నుంచి 2024 అక్టోబరు 31 మధ్యకాలంలో భర్త మరణిస్తే వారి భార్యకు పింఛన్ మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు స్పౌజ్ కోటాలో దరఖాస్తులు స్వీకరించి ఎంపిక చేసి వారికి పింఛను అందజేసేందుకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఈ కోటాలో గుంటూరు జిల్లాలో 2,565, పల్నాడు జిల్లాలో 3,094, బాపట్ల జిల్లాలో 2715 మందికి పింఛను అర్హత లభించింది. వీరికి ఈ నెల 12న పింఛను అందించనున్నారు. గత ఏడాది పింఛనును రూ.1000 పెంచి ప్రారంభించిన రోజు కావడంతో కొత్తగా పింఛను పొందిన వారికి కూడా ఆ రోజు నుంచి ఇవ్వాని ప్రభుత్వం నిర్ణయించింది.

## సౌర విద్యుత్.. సర్వే పూర్తి

- ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలార్ రూఫ్ టాప్స్
- పీఎం సూర్యఘర్‌తో ఉచిత విద్యుత్, అదనంగా అద్దె



వేమూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి సూర్యఘర్ ద్వారా ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచితంగా సౌర విద్యుత్ అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఈ క్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది గ్రామాల్లో సర్వే చేసి లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఎంపికైన వారి గృహాలపై సోలార్ రూఫ్ టాప్స్‌ను ఏర్పాటు చేస్తారు. తద్వారా ఆయా గృహాలకు సోలార్ విద్యుత్‌ను ఉచితంగా వినియోగించుకుని మిగిలిన విద్యుత్‌ను ట్రాన్స్‌కో కొనుగోలు చేయనున్నది. యూనిట్‌కు రూ.2.10 చొప్పున, అలాగే సోలార్ ప్యానళ్ల ఏర్పాటు చేసిన స్థలానికి ప్రతి అడుగుకు నెలకు రూపాయి చొప్పున అద్దె కూడా చెల్లించనుంది. 200 యూనిట్ల కన్నా తక్కువ విద్యుత్ వాడే వారికి ఈ సౌకర్యాన్ని కల్పించనుంది. రూ.1,40,000 విలువ కలిగిన రెండు కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ ప్యానళ్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం రూ.60 వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.80 వేలు కేటాయించింది. ఈ క్రమంలో వేమూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలోని 89 గ్రామాల్లో సర్వే చేసిన విద్యుత్ సిబ్బంది 20 వేల 985 మంది లబ్ధిదారులను గుర్తించారు. ఇందుకు సంబంధించి నివేదికలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపినట్లు ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. మరో 5104 మంది లబ్ధిదారులు అర్హత కలిగి ఉన్నా వారిలో కొందరు ఇతర గ్రామాలలో నివసిస్తున్నారన్నారు.

# జూన్.. చైల్డ్ డ్రైవ్ మాసం

బాల కార్మిక రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

అధికారులను ఆదేశించిన కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, మే 30 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీపీసీఆర్ సూచనల మేరకు జూన్‌లో చైల్డ్ డ్రైవ్ మాసంగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. బాలకార్మిక నిర్మూలనపై అధికారులతో కలెక్టర్ ఛాంబర్‌లో శుక్రవారం జరిగిన సమీక్షలో ఆయన ప్రసంగించారు. బాలకార్మిక రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. గ్రానైట్ క్వారీలు, రీచ్‌లు, ఫ్యాక్టరీలు, హేచరీలు, జీడిపప్పు, చేపలు, రొయ్యల ప్రాసెసింగ్ కేంద్రాల్లో తనిఖీలు చేసి బాల కార్మికులు ఉంటే కేసులు నమోదు చేయాలన్నారు. ఎక్కడైన బాలకార్మికులను గుర్తిస్తే 1098 టోల్ ఫ్రీ నెంబర్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో లేబర్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటశివప్రసాద్, పిల్లల సంరక్షణాధికారి పురుషోత్తం, డీఎమ్‌హెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖాధికారి రాధామాధవి, జిల్లాటాస్క్‌ఫోర్స్‌కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

- దివ్యాంగులు, 65 సంవత్సరాలు నిండిన వృద్ధులకు డీలర్లు ఇళ్ల వద్దకే వెళ్లి రేషన్ సరుకులను అందించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 4.70 లక్షల కార్డుదారుల్లో వృద్ధులు, దివ్యాంగులు 67,800 మంది ఉన్నారన్నారు. దుకాణాల వద్దనే సరుకులు పంపిణీపై ప్రచారం చేయాలన్నారు. సమావేశంలో పౌరసరఫరాలశాఖ జిల్లా అధికారి ఈబీ విలియమ్స్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు సూర్యలంకలో యోగా ప్రదర్శన


యోగాంధ్ర కార్యక్రమాలలో భాగంగా జిల్లాస్థాయి యోగాసనాల ప్రదర్శన సూర్యలంక నగర వనంలో శనివారం ఉదయం 6.30 నుంచి 7.30 వరకు జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లాఅధికారులు హాజరవుతారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

## డీసీఎంఎస్ చైర్మన్‌గా వడ్రాణం హరిబాబు

- అధికారిక ఉత్తర్వులు విడుదల



4



## నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

- హోటళ్ల నిర్వాహకులతో ఫుడ్ సేఫ్టీ జిల్లా అధికారి



బిర్యానీని పరిశీలిస్తున్న అధికారి దేవరాజు

బాపట్ల, మే 30 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని ఫుడ్ సేఫ్టీ జిల్లా అధికారి కె.దేవరాజు హోటళ్ల నిర్వాహకులను హెచ్చరించారు. పట్టణంలోని సూర్యలంకరోడ్డులో హోటళ్లు, రెస్టారెంట్లలో శుక్రవారం సిబ్బందితో కలిసి ఆయన తనిఖీలు చేశారు. ఆహార పదార్థాలు, బిర్యానీ తయారీకి వినియోగించిన చికెన్, ఆయిల్ను నాణ్యతలను పరిశీలించారు. వంట తయారీ, సరుకులు నిల్వ ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉన్నట్లు గుర్తించి నోటీసులు జారీ చేశారు. ఆయా శాంపిల్స్‌ను పరీక్షలు నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. వచ్చే నివేదికల ఆధారంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కూరగాయలు, చికెన్, ఇతర పదార్థాలను తాజాగా ఉంచుకోవాలని సూచించారు. బిర్యానీలో కృత్రిమ రంగులు కలపరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది అనీల్, తదితరులు పాల్గొన్నారు.

# ఏఎన్‌యూలో యోగాంధ్ర భారీ ర్యాలీ




ర్యాలీలో అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు

పెదకాకాని, మే 30( ఆంధ్రజ్యోతి): జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఏఎన్‌యూలో శుక్రవారం భారీ అవగాహన ర్యాలీ చేపట్టారు. వర్సిటీలోని ప్రధాన ప్రాంతాలు, మెయి న్ గేటు వద్ద నినాదాలు చేశారు. వర్సిటీ తాత్కాలిక ఉపకులపతి ఆచార్య కె.గంగాధరరావు, తాత్కాలిక రిజిస్ట్రార్ జి.సింహాచలం, దూరవిద్య కేంద్రం సంచాలకులు ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు, యూజీ పరీక్షల సమన్వయకర్త ఆచార్య ఎన్‌వీ కృష్ణారావు, ప్రొఫెసర్ పాల్ కుమార్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వి.సిద్ధయ్య, ప్రొఫెసర్ దివ్యతేజోమూర్తి, వెంకటేశ్వర్లు, డాక్టర్ మల్లికార్జున రావు, వెంకటేశ్వర్లు, రత్తయ్య, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# డీసీఎంఎస్ చైర్మన్‌గా వడ్రాణం హరిబాబు

గుంటూరు, మే 30(ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) చైర్మన్‌గా పొన్నూరు నియోజకవర్గానికి చెందిన వడ్రాణం హరిబాబు నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ అధికారిక ఉత్తర్వులు విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీల చైర్మన్‌లను ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటి వరకు డీసీఎంఎస్ పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ ఎ.భార్గవ్‌తేజ వ్యవహరించారు. నూతన చైర్మన్ హరిబాబు జూన్ మొదటి వారంలో ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు సమాచారం.

# మణిపాల్‌లో బోన్ బ్రిడ్జ్ ఇంప్లాటేషన్ విజయవంతం

తాడేపల్లి టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పరిధిలోని మణిపాల్ హాస్పిటల్‌లో ఏపీలోనే తొలిసారిగా బోన్ బ్రిడ్జ్ ఇంప్లాటేషన్ విజయవంతంగా జరిగిందని డాక్టర్ సందీప్, శ్రీధర్, షహిదా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైక్రోటియా అనే చెవుల లోపంతో పుట్టిన చిన్నారికి వినికిడి కల్పించారని పేర్కొన్నారు. ఈ శస్త్ర చికిత్సను కన్సల్టెంట్ ఈఎన్‌టీ, హెడ్ అండ్ నెక్ సర్జరీ అండ్ కోక్లియర్ ఇంప్లాంట్ సర్జన్ డాక్టర్ వీవీకే సందీప్, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ షహిదా సంయుక్తంగా విజయవంతంగా నిర్వహించారని తెలిపారు. సదరు చిన్నారి జన్మతహ రెండు చెవులలోనూ తీవ్రమైన కనెక్టివ్ హియరింగ్ లాస్‌తో మణిపాల్‌కు వచ్చిందని పేర్కొన్నారు. ఇయర్ కెనాల్ సరిగ్గా లేకపోవడంతో సాంప్రదాయ హియరింగ్ ఎయిడ్స్ ఉపయోగించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. శస్త్రచికిత్స విజయవంతం కావడంతో.. రాష్ట్ర వ్యాప్తంగా బోన్ కండక్షన్ పరిష్కారాలపై అవగాహన పెరిగే అవకాశం ఉందని డాక్టర్ సందీప్ తెలిపారు.

# ఉన్నది 48 గంటలే..!

- 3న ఉద్యోగుల బదిలీలపై మళ్లీ నిషేధం
- మిగిలింది శని, సోమవారం, ఆదివారం సెలవు
- కొన్ని శాఖల్లో విడుదల కాని మార్గదర్శకాలు

గుంటూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలపై సడలించిన నిషేధం మరో మూడు రోజుల్లో అమలులోకి రానుంది. అందులో ఒక రోజు ఆదివారం సెలవుదినం తీసేస్తే మిగిలేది కేవలం 48 గంటలు మాత్రమే. అయినప్పటికీ ఇంకా కొన్ని ప్రభుత్వ శాఖల్లో బదిలీల ప్రక్రియ పూర్తి కాలేదు. కొన్నింటిలో అయితే కౌన్సెలింగ్ నిర్వహించి ఉత్తర్వులు జారీ చేయలేదు. అలానే మూడు, నాలుగు శాఖలకు అయితే ఇప్పటి వరకు బదిలీల మార్గదర్శకాలే విడుదల కాలేదు. ఈ నేపథ్యంలో జూన్ 3వ తేదీ నుంచి అమలులోకి రానున్న నిషేధానికి మరికొన్ని రోజుల పాటు సడలింపు ఇవ్వాలని ఆయా శాఖల్లోని ఉద్యోగులు కోరుతున్నారు. ఈ విషయంపై ఉద్యోగ సంఘాల నాయకులు ప్రభుత్వానికి నివేదించాలని నిర్ణయించారు.

ఈ సంవత్సరం ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలపై నిషేధాన్ని ఈ నెల 16 నుంచి జూన్ 2వ తేదీ వరకు ప్రభుత్వం సడలించింది. సెలవు దినాలు పోను 15 పని దినాలను కేటాయించి బదిలీల ప్రక్రియ పూర్తి చేసుకోవాలని స్పష్టం చేసింది. ఆ మేరకు విద్య, మార్కెటింగ్, వ్యవసాయ తదితర శాఖల్లో బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియని పూర్తి చేశారు. రెవెన్యూ, సర్వేలో ఇంకా కొనసాగుతోంది. ఇంజనీరింగ్ డిపార్టుమెంట్‌లు, పంచాయతీరాజ్‌లోనూ ఇదే పరిస్థితి. వాణిజ్య పన్నుల శాఖలో అయితే బదిలీలకు సంబంధించి మార్గదర్శకాలే జారీ కాలేదు. కొన్ని శాఖల్లో అయితే కౌన్సెలింగ్‌లు నిర్వహించకుండా ప్రజాప్రతినిధుల లేఖల సిఫార్సుల మేరకు బదిలీలు చేసేందుకు ప్రక్రియని పూర్తి చేశారు.

బదిలీ ఉత్తర్వులు ముందుగానే ఇస్తే ఉద్యోగులు ఎవరైనా కోర్టులో పిటిషన్లు వేస్తారన్న భయంతో చాలా శాఖల్లో అధికారులు ఆర్డర్స్ బయటకు విడుదల చేయలేదు. పాత తేదీతో జూన్ 3న విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేసుకొంటున్నారు. కాగా బదిలీలకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన గడువు చాలా తక్కువగా ఉందని, దీనిని మరో వారం నుంచి పది రోజుల పాటు పొడిగించాలని ఉద్యోగ సంఘాల నాయకులు కోరుతున్నారు. ఇప్పటికే రాష్ట్ర సంఘాల ద్వారా ప్రభుత్వానికి వినతిపత్రాలను కూడా సమర్పించారు. అయితే ఈ వారం అంతా సీఎంతో సహా మంత్రులు పర్యటనల్లో ఉండటం వల్ల అమరావతి రాజధానిలో అందుబాటులో లేరు. సోమవారం విధులకు హాజరయ్యే అవకాశం ఉండటంతో పొడిగింపుపై నిర్ణయం ఆ రోజున తీసుకొనే అవకాశం ఉందని ఉద్యోగులు భావిస్తున్నారు.

# చదువులో జ్ఞానశ్రీ..దాతల చేయూత కావాలి

పెదకూరపాడు, మే 30 (ఆంధ్రజ్యోతి) : చిన్న నాటి నుంచి చదువులో ఎంతో ప్రతిభ కలిగి.. ప్రతి క్లాసులో అన్ని సబ్జెక్టుల్లో 95 శాతానికి పైగా మంచి మార్కులు సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది. పెదకూరపాడుకు చెందిన అవ్వారి జ్ఞానశ్రీ. తల్లి కుమారి, అమ్మమ్మ, తాతయ్య పర్యవేక్షణలో చదువును కొనసాగిస్తోంది. బాలిక తల్లి కుమారి ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పని చేస్తూనే..తన తల్లిదండ్రులు కూలీ పనుల ద్వారా వచ్చే డబ్బులతో కుమార్తెను చదివించుకుంది. దీంతో జ్ఞానశ్రీ 10వ తరగతిలో పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో 587 మార్కులు సాధించింది. 2023లో జిల్లా స్థాయిలో ముందంజలో నిలిచింది. గుంటూరులోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఎంపీసీలో 981 మార్కులు సాధించింది. జేఈఈ అడ్వాన్స్ పూర్తి చేసి.. జూన్ 2న విడుదలయ్యే ఫలితాల కోసం ఎదురు చూస్తోంది. ప్రాథమిక విద్య స్థానికుల ఆర్థిక సాయంతో.. ఇంటర్మీడియెట్ దాతల విరాళాలతో పూర్తి చేసి చదువులో రాణిస్తోంది జ్ఞానశ్రీ. దాతలు చేయూతనిస్తే తన చదువుకు ఎటువంటి ఆటంకం కలగదని విద్యార్థిని కోరుకుంటోంది. ఆస్తులు లేకపోయినా.. చదువులో రాణిస్తున్న ఇలాంటి బాలికకు చేయూతనిచ్చి ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. సహాయం చేయ దలచుకున్న దాతలు 72880 62392 నంబరు సంప్రదించాలని కోరారు.



అవ్వారి జ్ఞానశ్రీ

# రౌడీషీటర్లకు తగిన గుణపాఠం

**బీసీ సంక్షేమ సంఘం విద్యార్థి యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కోటి యాదవ్**

తెనాలి అర్బన్, పెదకాకాని మే 30 (ఆంధ్రజ్యోతి): తెనాలిలో రౌడీషీటర్లకు పోలీసులు తగిన గుణపాఠం చెప్పారని, కుల సంఘాలు వారిని వెనకేసుకుని రావడం సరికాదని బీసీ సంక్షేమ సంఘం విద్యార్థి యువజన విభాగం అధ్యక్షుడు పి.కోటి యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని తగిన విధంగా దండించకపోతే మరింత పెచ్చరిల్లుతారన్నారు. తప్పు చేయాలంటే భయపడాలనే ఉద్దేశంతోనే పోలీసులు అలా ప్రవర్తించారే కానీ, మరొకటి కాదన్నారు. ప్రాణహాని ఉందని పోలీసులకు బీసీ అయిన కానిస్టేబుల్ చిరంజీవి ఫిర్యాదు చేస్తేనే పోలీసులు చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. కానిస్టేబుల్ భార్య ఎస్సీ అయినప్పటికీ వారికి న్యాయం చేయకుండా రౌడీషీటర్ల పక్షాన కుల సంఘాలు మాట్లాడటం సరి కాదని హితవు పలికారు. నిజంగా దళితులకు అన్యాయం జరిగితే తమ సంఘం కూడా పోరాడుతుందని రౌడీషీటర్లకు హంతకులకు మద్దతుగా నిలిస్తే కుల సంఘాల ఐక్యతకు విలువ లేకుండా పోతుందన్నారు. గంజాయి కేసులో రౌడీ షీటర్లు నవీన్ కుమార్, జాన్ విక్టర్, రాకేష్‌ను అరెస్టు చేశారనే అక్కసుతో కానిస్టేబుల్ చిరంజీవిపైన వారు దాడి చేశారని గుర్తుచేశారు. కానిస్టేబుల్ భార్య ఒక ఎస్సీ అని, తల్లిదండ్రులు లేని అనాథ అనే విషయాన్ని దళిత సంఘాలు గుర్తించాలని కోరారు. రౌడీ షీటర్లు గంజాయి మత్తులో చిరంజీవిని చంపి ఉంటే దళిత మహిళకు అన్యాయం జరిగి ఉండేదన్నారు.

# సీఎల్ఈఏఎస్ఏ నూతన కార్యవర్గం ఏర్పాటు




సమావేశంలో సీఎల్ఈఏఎస్ఏ ప్రతినిధులు

మంగళగిరి, మే 30 (ఆంధ్రజ్యోతి): కన్ఫెడరేషన్ ఆఫ్ లైసెన్స్‌డ్ ఇంజనీర్స్, సర్వేయర్స్, ఆర్కిటెక్ట్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ తొలి కార్యవర్గ సమావేశం మంగళగిరిలో జరిగింది. సంఘం ఆవిర్భావంపై చర్చ, సర్వసభ్య సమావేశం, టెక్నికల్ సెమినార్లు, లోకల్ చాప్టర్లు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. గౌరవ చైర్మన్‌గా వేల్పుల రాము, చైర్మన్‌గా ఎం.శ్రీనివాసరావు, అధ్యక్షుడిగా కె.కమలాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎస్.సుందరరాజు, ప్రధాన కార్యదర్శిగా నెలకంటి ఎన్‌వీఎస్ఎస్ మూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఆర్.సతీశ్‌కుమార్, కోశాధికారిగా యూఎస్ సంపత్‌కుమార్, మరికొంత మంది సభ్యులను ఎన్నుకున్నారు. రాజమండ్రి జోన్ అధ్యక్షుడిగా ఏకే జిలానీ, అమలాపురం జోన్ అధ్యక్షుడిగా ఎస్.ఫణికుమార్, భీమవరం జోన్ అధ్యక్షుడిగా కేవీఎం కృష్ణ, సభ్యులను ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

# ఆసియా క్రీడల్లో రజితకు స్వర్ణం



కుంజా రజిత

మంగళగిరి సిటీ, మే 30 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి చెందిన క్రీడాకారిణి కుంజా రజిత ఆసియా క్రీడల్లో మరో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. దక్షిణ కొరియాలోని గూమి నగరంలో గురువారం జరిగిన 26వ ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో భారత జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించిన రజిత 400 మీటర్ల రిలే పరుగులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చింది. ఈ పోటీలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సొంతం చేసుకుంది. అంతర్జాతీయ స్థాయి భారత మహిళా రన్నర్లు జిస్నా మాథ్యూ, రూప చౌదరి, శుభ వెంకటేష్‌తో కూడిన 400 మీటర్ల రిలే పరుగు జట్టులో రజిత కూడా పాల్గొంది. ఈ జట్టు 3.34 సెకన్ల వ్యవధిలో నిర్ణీత దూరాన్ని చేరుకుని ఫైనల్స్‌లో వియత్నం, శ్రీలంక జట్లను అధిగమించింది. 2013 తర్వాత ఇదే ఈవెంట్‌లో తిరిగి స్వర్ణ పతకం సాధించడం విశేషం. రజితను ఎస్ఆర్ఎం ప్రెసిడెంట్ డాక్టర్ సత్యనారాయణన్, వైస్ చాన్సలర్ ఆచార్య మనోజ్‌కుమార్ అరోరా, ప్రోవైస్ చాన్సలర్ డాక్టర్ సతీశ్‌కుమార్, స్పోర్ట్స్ డైరెక్టర్స్ అనూప్‌సింగ్ సూర్యవంశీ, సుస్మితా సింగ్, శ్రీపతి తదితరులు అభినందించారు.

**నెక్ సూచించిన కోడిగుడ్ల ధర**

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

**బ్రాయిలర్ ధరలు**

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ (కిలో) | 121, 129, 140 |
| చికెన్ విత్ స్కిన్(కిలో) | 228.00 |
| చికెన్ స్కిన్ లెస్(కిలో) | 238.00 |

# సన్నబియ్యంతో భోజనం

(5వ పేజీ తరువాయి)

దొడ్డ బియ్యానికి బదులు సన్న బియ్యం పంపిణీకి ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ఇప్పటికే ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి జిల్లా నుంచి ఇందుకు అవసరమైన ఇండెంట్‌ను పాఠశాల విద్యాశాఖ పౌరసరఫరాల శాఖకు పంపింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రభుత్వ జడ్పీ మండల పరిషత్ ఎయిడెడ్ పాఠశాలలు దాదాపు 600కిపైగా ఉండగా 6.75 లక్షల మంది విద్యార్థులు ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యాభ్యాసం చేస్తున్నారు. బీసీ, గిరిజన, సాంఘిక సంక్షేమ శాఖ హాస్టళ్లు మరో 100 కిపైగా ఉన్నాయి. ఆయా హాస్టళ్లలో దాదాపు 8 వేల మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. గత ఏడాది నుంచి ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని 23 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించారు. పాఠశాల, కళాశాలల్లో మధ్యాహ్న భోజనానికి, వసతిగృహాల్లోని విద్యార్థులకు సన్నబియ్యాన్ని పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

**ధాన్యం సేకరించిన పౌరసరఫరాల శాఖ**

ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు, వసతిగృహాలకు అవసరాల నిమిత్తం రాష్ట్రస్థాయిలో ధాన్యం సేకరించి జిల్లాల వారీగా పంపిణీకి పౌరసరఫరాల శాఖకు ఏర్పాట్లు చేసింది. సన్న బియ్యం పక్కదారి పట్టకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ పరిస్థితుల్లో గోదాముల నుంచి డీలర్లకు పంపిణీ చేయకుండా నిర్దేశించిన పాఠశాలలకు, హాస్టళ్లకు నేరుగా సరఫరా చేయాలని నిర్ణయించింది. దాదాపు పదివేలకు పైగా మెట్రిక్ టన్నులు బియ్యం అవసరమని ప్రాథమిక అంచనా వేసినట్లు సమాచారం.

**ప్రతి ఒక్కరూ భోజనం చేసేలా..**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులందరూ భోజనం చేసేలా ఇప్పటికే మెనూలో మార్పులు తీసుకొచ్చారు. తాజాగా బియ్యం పంపిణీలో కూడా మార్పులు తీసుకు రానుండడంతో విద్యార్థులు ఎక్కువమంది భోజనం చేసే అవకాశం ఉంటుందని ప్రధానోపాధ్యాయులు చెప్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# జల్‌జీవన్‌లో.. జాగు

(5వ పేజీ తరువాయి)

ఎక్కడిక్కడ నిలిచిపోయాయి. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల తాగునీటి పథకాల అభివృద్ధితో పాటు ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్లు ఇవ్వడంలో విఫలమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఈ పథకం పనుల్లో పురోగతి కనిపించడంలేదు. నిధులున్నా పనులు ముందుకు సాగడంలేదు. దీంతో గ్రామాల్లో రక్షిత నీటి పథకాలు సక్రమంగా పనిచేయడంలేదు. దీంతో అపరిశుభ్రమైన, ఫ్లోరైడ్ ఉన్న నీటిని అనేక ప్రాంతాల్లో ప్రజలు వినియోగించుకోవాల్సి వస్తోంది. తద్వారా ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నా పాలకులు, అధికారుల్లో చలనం లేదు.

● జల్‌జీవన్ మిషన్‌లో రాష్ట్రంలోనే పల్నాడు జిల్లా అట్టడుగున 26వ స్థానంలో ఉంది. రూ.508.16 కోట్లు అంచనాతో 1055 పనులు చేపట్టగా 219 పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. మూడో వంతు పనులు టెండర్ స్థాయి కూడా దాటలేదు. నిధుల విడుదలలో జాప్యం జరుగుతుండటంతో కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేసేందుకు ముందుకు రావడంలేదు. కేవలం 16 గ్రామాల్లోనే నూరు శాతం గృహాలకు కుళాయి కనెక్షన్ ఉన్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ వెల్లడించింది.

● బాపట్ల జిల్లా జలజీవన్ అమలులో రాష్ట్ర స్థాయిలో 25వ స్థానంలో ఉంది. జిల్లాలో 19.82 శాతం నుంచి 40.84 శాతానికి కుళాయిల సంఖ్య పెరిగింది. రూ.205.22 కోట్ల అంచనాతో చేపట్టిన 723 పనుల్లో 223 మాత్రమే పూర్తయ్యాయి. 10 గ్రామాల్లో మాత్రమే నూరు శాతం కుళాయిలు ఇచ్చారు.

● గుంటూరు జిల్లాలో జల్‌జీవన్ అమల్లోకి వచ్చిన అనంతరం 33,731 గృహాలకు కొత్తగా నీటి కుళాయిలు ఇచ్చారు. రాష్ట్రంలో జిల్లా 15వ స్థానంలో ఉంది. 308 పనులు చేపట్టగా 172 పూర్తయ్యాయి. 28 గ్రామాల్లో నూరు శాతం కుళాయిలు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

# ఇద్దరికి కరోనా

(5వ పేజీ తరువాయి)

వర్గాలు వెల్లడించాయి

**రోగులు మాస్కులు ధరించాలి**

దగ్గు, తుమ్ములతో బాధపడే వారు తప్పనిసరిగా మాస్కులు ధరించాలని వైద్యవర్గాలు కోరాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో కొవిడ్-19 కేసులు ప్రబలుతున్న నేపథ్యంలో గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్సలకు వచ్చే వారు తప్పనిసరిగా మాస్కులు ధరించి రావాలని శుక్రవారం సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి సూచనలు చేశారు. జ్వరం, చలి, నీరసం, గొంతు మంట, ఒంటినొప్పులు, నోరు చేదుగా ఉండటం, వాసన తెలియకపోవడం, తలనొప్పి ముక్కు నుంచి నీరు కారడం వంటి లక్షణాలు కనిపిస్తే కొవిడ్ పరీక్షలు చేయించుకోవాలని ఆరోగ్యశాఖ సూచించింది. కొవిడ్ కేసులు ప్రబలిన దేశాల నుంచి ప్రయాణం చేసి వచ్చే వారు తప్పనిసరిగా కరోనా పరీక్షలు చేయించుకోవాలని తెలిపింది.

**ఆందోళన అవసరం లేదు**



కొవిడ్-19పై ప్రజలు ఆందోళన చెందవద్దు. ప్రస్తుతం సర్క్యులేట్‌లో ఉన్నది ఒమిక్రాన్ రూపంలో ఉన్న జేఎన్1 వేరియంట్. ఇది అంత ప్రమాదకారి కాదు. ఈ వేరియంట్ బారిన పడిన వృద్ధులు, ఇతర దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు ఉన్న వారు ఆస్పత్రిలో చేరి చికిత్సలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నా, ఇతరులకు పెద్ద హాని కలిగించే శక్తి ఉండదు. అనుమానిత లక్షణాలతో వచ్చే రోగుల కోసం ప్రభుత్వాస్పత్రిలో ప్రత్యేక కొవిడ్ ఓపీ, 15 పడకలతో ఐసోలేషన్ వార్డు ఏర్పాటు చేశాం.

– డాక్టర్ రమణ యశస్వి, జీజీహెచ్ సూపరింటెండెంట్

# 3న ఏపీఆర్‌జేసీలో.. అతిథి అధ్యాపక పోస్టులకు ఇంటర్వ్యూలు



మాచర్ల రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయపురిసౌత్‌లో ఉన్న ఏపీఆర్‌జేసీలో అతిథి అధ్యాపక పోస్టులకు జూన్ 3వ తేదీన కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ సరోజిని శుక్రవారం తెలిపారు. కళాశాలలో తెలుగు, సంస్కృతం, కెమిస్ట్రీ, లైబ్రరీ సైన్స్, ఫిజికల్ డైరెక్టర్‌తోపాటు మ్యాథమెటిక్స్ రెండు పోస్టులు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు. సంబంధిత సబ్జెక్టుల్లో 50 శాతం మార్కులు, ఇంగ్లీష్ మీడియంలో పాఠ్యాంశాల బోధన అర్హతలని తెలిపారు. అర్హులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 10:30 గంటలకు కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు.

# రెండు సినిమా హాళ్లకు లైసెన్స్‌లు లేవు

చిలకలూరిపేట, మే30 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో సినిమా థియేటర్ల తనిఖీలో రెండు థియేటర్లకు లైసెన్స్‌లు లేవని అధికారులు గుర్తించారు. యజమానులు వీలైనంత త్వరగా లైసెన్సు తెచ్చుకోవాలని తహసీల్దారు హుస్సేన్ సూచించారు. లైసెన్సు లేని కారణంగా ప్రస్తుతానికి ఈ థియేటర్లను మూసివేయించారు. పట్టణంలో మొత్తం పది సినిమా థియేటర్లు ఉండగా వాటిలో ఐదు మూతపడి ఉన్నాయి. ఆయా థియేటర్లలో వసతులు, సదుపాయాలను పరిశీలించిన అధికారులు వారికి పలు సూచనలు చేశారు. కొన్నింటిలో కనీసం 15 టికెట్లు అమ్ముడు పోతేనే షో ప్రారంభిస్తామని ముందుగానే షరతు విధించి టికెట్లు అమ్ముతున్నారు.

# బంగారం, వెండి ఆభరణాల అపహరణ



పగులగొట్టిన బీరువా



దుండగులు వదిలివెళ్లిన బైక్

మాచర్లటౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని దుండగులు గృహంలోకి ప్రవేశించి బంగారం, వెండి ఆభరణాలు అపహరించిన ఘటన మాచర్ల పట్టణంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. పట్టణంలోని 22వ వార్డుకు చెందిన చల్లా పిచ్చయ్య ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. రెండు రోజుల క్రితం తన సోదరుడు నివాసముంటున్న గుంటూరుకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. శుక్రవారం ఉదయం ఇంటి బయట తలుపునకు తాళాలు పగులకొట్టి ఉండడాన్ని గమనించిన చుట్టుపక్కల వారు పిచ్చయ్యకు సమాచారం అందించారు. పిచ్చయ్య ఇంట్లో పరిశీలించగా.. బీరువా తాళాలు పగులకొట్టి ఉండడాన్ని గుర్తించారు. అందులోని ఐదు గ్రాముల బంగారం, చెవి దిద్దులు, వెండి వస్తువులు అపహరణకు గురైనట్లు గుర్తించాడు. వీటి విలువ సుమారు రూ. లక్ష వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు. చోరీపై పట్టణ ఎలాంటి ఫిర్యాదు నమోదు కాలేదు. అలాగే పట్టణంలోని 20వ వార్డులో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు ఓ గృహంలో చోరీకి యత్నిస్తుండగా కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో.. వారు అక్కడి నుంచి పరారయ్యారు. దుండగులు తమ ద్విచక్ర వాహనాన్ని అక్కడే వదిలేశారు. సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బైకు పిడుగురాళ్ల పట్టణంలో దొంగిలించినదిగా గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మే 30 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శుక్రవారం నాటికి 512.40 అడుగులు ఉంది. ఇది 135.78 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 5598 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ 450 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో 6048 క్యూసెక్కుల నీరు దిగువకు చేస్తున్నారు.

# బాపట్ల వార్తలు





## ఏసు ప్రభువు ఆశీస్సులు అందరిపై ఉండాలి

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

పిట్టలవానిపాలెం, మే 30 (ఆంధ్రజ్యోతి) : ఏసుప్రభువు ఆశీస్సులు అందరిపై మెండుగా ఉండాలని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. పిట్టలవానిపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించిన క్రీస్తు లూథరన్ చర్చి ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎమ్మెల్యే నరేంద్రవర్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కుల, మతాలకు అతీతంగా దైవచింతనతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, దైవజనులు, ఆయా గ్రామాలకు చెందిన టీడీపీనాయకులు తదితరులు పాల్గొన్నారు.



లూథరన్ చర్చిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తదితరులు

## రేషన్ దుకాణాల వద్దే సరుకులు తీసుకోవాలి : తహసీల్దార్

బాపట్ల, మే 30 (ఆంధ్రజ్యోతి) : జూన్ 1వ తేదీ నుంచి రేషన్ దుకాణాల వద్దే బియ్యం, సరుకులు తీసుకోవాలని తహసీల్దార్ షేక్ సలీమా తెలిపారు. ఈ విషయమై శుక్రవారం ఆమె మాట్లాడుతూ రేషన్ కోసం వచ్చే కార్డు హోల్డర్లను క్యూలో నిలబెట్టవద్దని డీలర్‌లకు సూచించారు. సరుకులు ఇచ్చిన అనంతరం రశీదులు వెంటనే ఇవ్వాలన్నారు. దివ్యాంగులు, వృద్ధులకు డీలర్‌లు ఇంటి వద్దకే సరుకులు ఇస్తారని చెప్పారు. ఆదివారం కూడా రేషన్ షాపులు పని చేస్తాయన్నారు. 15వ తేదీలోపు ఎప్పుడైనా రేషన్ తీసుకోవచ్చు అని తహసీల్దార్ తెలిపారు. అనంతరం మండల, పట్టణంలోని రేషన్ దుకాణాలను తహసీల్దార్ తనిఖీ చేశారు. రేషన్ డీలర్‌లకు పలు సూచనలు చేశారు. కార్డు హోల్డర్లందరికి సక్రమంగా రేషన్ పంపిణీ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ ఫణికుమార్ తదితరులు ఉన్నారు.



రేషన్ దుకాణం పరిశీలిస్తున్న తహసీల్దార్ షేక్ సలీమా

## బాపట్ల కాలేజి ఆఫ్ ఫార్మసీలో ఎన్‌సీసీ క్యాంప్ ప్రారంభం

బాపట్లరూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌సీసీ శిక్షణ తరగతులు కళాశాలలో ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీఈజీకే మూర్తి అన్నారు. కంబైండ్ యాన్యువల్ ట్రైనింగ్ క్యాంప్-2 శిక్షణ తరగతులను కల్నల్ ఎ.ఉదయ్ కుమార్, లెఫ్టికల్నల్ జె.మహేష్, ఎస్‌ఎం కురుదీప్‌లు ప్రారంభించారని ఫార్మసీ కళాశాల ఏఎన్‌వో సీహెచ్ సుష్మా తెలిపారు. ఆమె మాట్లాడుతూ 8వ తరగతి నుంచి డిగ్రీ, బీటెక్ చదువుతున్న ఎన్‌సీసీ క్యాడెట్స్ సుమారు 600 మంది పాల్గొన్నారని తెలిపారు. పది రోజులపాటు శిక్షణా తరగతులు నిర్వహిస్తారని, జూన్ 7వ తేదిన ముగియనుందని తెలిపారు. ఈ శిక్షణ తరగతులలో గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాలోని వివిధ పాఠశాలల, కళాశాలలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారని తెలిపారు. దేశ రక్షణ వ్యవస్థలో విద్యార్థులు భాగస్వాములయ్యేందుకు సిద్ధంగా ఉండాలని ఎన్‌సీసీ ద్వారా తీసుకునే శిక్షణ తరగతులు సైనిక శిక్షణలో ప్రాథమిక దశను పూర్తి చేసుకోవటంతోపాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవచ్చునని కల్నల్ ఎ.ఉదయ్‌కుమార్ తెలిపారు. ఈ క్యాంప్ తమ కళాశాలలో నిర్వహించటం గర్వకారణమని బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు, సెక్రటరి మానం నాగేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.




ఎన్‌సీసీ విద్యార్థులకు సూచనలు చేస్తున్న కల్నల్ ఎ.ఉదయ్‌కుమార్ తదితరులు

## మహిళల జీవనోపాధికి కోరినంత రుణాలు

● డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు

కర్లపాలెం, మే 30 (ఆంధ్రజ్యోతి) : మహిళల జీవనోపాధికి పారదర్శకంగా కోరినంత రుణాలు అందుబాటులో ఉంటాయని డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు అన్నారు. కర్లపాలెంలోని మండల సమాఖ్య కార్యాలయంలో సీహెచ్ ధనలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించగా డీఆర్‌డీఏ పీడీ ముఖ్యఅతిథిగా పాల్గొని పలు సూచనలు చేశారు. పీడీ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ మహిళా సంఘాల ద్వారా పేదరిక నిర్మూలనే ప్రధాన లక్ష్యంగా సెర్ప్ ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ డీపీఎం ఎల్‌హెచ్ రవీంద్రబాబు, సుబ్బారావు, ఫైనాన్స్ రవి, యూనియన్ బ్యాంక్ మేనేజర్ మానస, ఇండియన్ బ్యాంక్ మేనేజర్ రత్నజ్యోతి, చైతన్యగోదావరి బ్యాంక్ మేనేజర్ అంబరసన్, స్త్రీనిధి మేనేజర్ కామేశ్వరి, మండల సమాఖ్య ప్రతినిధులు నసీమా, శివలీల, ఏపీఎం శ్రీనివాసులరెడ్డి, పీసీలు శ్రీధర్, శివప్రభ, రాఘవ, అకౌంటెంట్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు

## కడప మహానాడు జగన్ రాజకీయ సమాధికి సంకేతం : కొల్లా

బాపట్ల, మే 30 (ఆంధ్రజ్యోతి) : కడప మహానాడు జగన్ రాజకీయ సమాధికి సంకేతమని సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి అన్నారు. ఈవిషయమై శుక్రవారం ఆయన మాట్లాడుతూ కడపలో మహానాడు ఒక పెద్ద డ్రామా అని వైసీపీ అధినేత జగన్మోహనరెడ్డి అవాకులు, చెవాకులు పేలటం అతని గుండెల్లో చెలరేగిన రాజకీయసునామీకి నిదర్శనమన్నారు. మహానాడులో జనప్రభంజనం కడప జిల్లా కోటను పూర్తిగా బద్దలు కొట్టినట్లు ఉందన్నారు.

## బాపట్లలో భారీ వర్షం

బాపట్ల, మే 30 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలంలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. మూడుగంటలకుపైగా ఎడతెరిపి లేకుండా గాలులతో కూడిన వర్షంతో జనసంచారం స్తంభించిపోయింది. ఉదయం నుండి ఉక్కపోత ఉన్నప్పటికి రాత్రి ఒక్కసారిగా వచ్చిన వర్షంతో వాతావరణం చల్లబడింది. మురికివాడలల్లో లోతట్టు ప్రాంతాలలో వర్షపునీరు నిలిచింది. పట్టణ ప్రధాన కూడళ్ళలో కూడా వర్షపునీరు పెద్దఎత్తున నిలిచింది.

### విద్యుత్‌కోతతో ప్రజల ఇక్కట్లు

కొద్దిపాటి గాలి, వానకు సైతం విద్యుత్ సరఫరాలో అవాంతరాలు తలెత్తుతున్నాయి. బాపట్లలో కొద్దిరోజులుగా ఇష్టానుసారంగా విద్యుత్ సరఫరా స్తంభించిపోతున్నది. రాత్రి సమయాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోయి ప్రజలు నానా ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఉక్కపోత, దోమలమోతతో అల్లాడిపోతున్నారు. అధికారులు అవాంతరాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## పోతుమర్రు పంచాయతీ కార్యదర్శి మృతి



గోపాలరావు (ఫైల్)

వేమూరు, మే 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోతుమర్రు మైనర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న ఏగోపాలరావు (50) శుక్రవారం తెనాలి మండలం కఠెవరం గ్రామంలోని స్వగృహంలో అనారోగ్య కారణంతో మృతి చెందారు. ఆయనకు భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గోపాలరావు మృతికి ఎంపీడీవో శివన్నారాయణ, ఈవోపీఆర్డీ శేఖర్, పంచాయతీల కార్యదర్శులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, సచివాలయాల సిబ్బంది సంతాపం వెలిబుచ్చారు.

# పట్టణ సుందరీకరణ పనులు వేగవంతం చేస్తాం

● కమిషనర్ రఘునాథరెడ్డి

బాపట్ల, మే 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణ సుందరీకరణ పనులను వేగవంతం చేస్తామని కమిషనర్ జి.రఘునాథరెడ్డి తెలిపారు. పట్టణంలోని భీమునిగుంటవాగులో సిల్ట్ తొలిగింపు పనులను శుక్రవారం సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు. సూర్యలంకరోడ్డులో, ఆనందనగర్ వద్ద డ్రైనేజి పూడిక తీతపనులను పరిశీలించిన అనంతరం అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేశారు. క్యాంటీన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్నారు. సంజయ్‌గాంధీకాలనీ వద్ద ప్రధాన డ్రైనేజిపై ఉన్న ఆక్రమణలను తొలిగించారు. మిగిలిన ఆక్రమణలను కూడా తొలిగించే విధంగా చర్యలు చేపట్టాలని టీపీవో కె.లక్ష్మీని ఆదేశించారు. 8వ వార్డు మల్లికార్జున బృందావన కాలనీలో డ్రైనేజి పూడికతీత పనులను పర్యవేక్షించారు. బృందావనం రోడ్డు దగ్గర నూతనంగా నిర్మించిన తాగునీటి రిజర్వాయర్ వరకు భీముని గుంటవాగు వెంట నిర్మించిన రహదారి అన్యాక్రాంతమైన దృష్ట్యా రోడ్డుకు ఇరువైపుల పిచ్చిచెట్లు తొలిగించి ఆక్రమణలను తీసివేశారు. 13వ వార్డులో రైల్వేట్రాక్ వద్ద నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు తవ్వకాల్వ ప్రధాన డ్రైనేజి శుభ్రం చేశారు. ప్రణాళిక ప్రకారం ఇంజనీరింగ్ అధికారులు, ప్రజాఆరోగ్యశాఖాధికారులు డ్రైనేజిని శుభ్రం చేయించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈ ఎస్‌ఎస్ కృష్ణారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ కరుణ, పురపాలక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పిచ్చి చెట్ల తొలగింపును పరిశీలిస్తున్న కమిషనర్ జి.రఘునాథరెడ్డి తదితరులు

## ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

బాపట్ల, మే 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పాతబస్టాండ్ కూడలిలో శుక్రవారం సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆటోవర్కర్స్ యూనియన్ జిల్లా నాయకుడు బుచ్చిరాజు బ్రహ్మం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి సీఐటీయూ పట్టణ నాయకుడు కె.శరత్ ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఆవిష్కరించి అక్కడ జరిగిన సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల పట్ల కుట్రపూరిత ధోరణిగా వ్యవహరిస్తూ యాజమాన్యానికి కార్మికులను బానిసలుగా మార్చేందుకు లేబర్ కోడ్స్ చట్టాలను అమలు చేసేందుకు ప్రణాళిక చేసిందన్నారు. సీఐటీయూ బాపట్ల అధ్యక్షుడు లక్ష్మణరావు మాట్లాడుతూ ఎన్నో పోరాటాలతో, త్యాగాలతో సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ బాపట్ల నాయకులు కె.శ్రీనివాస్, దుర్గారావు, అంజి, వలి, నాగబాబు, చరణ్, హరిబాబు, ఆటో, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

### వేమూరులో

వేమూరు, మే 30 (ఆంధ్రజ్యోతి) : వేమూరులో శుక్రవారం సంఘ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. సంఘ నాయకులు వేమూరు విజయరాజు రైల్వే గేటు సెంటర్‌లో సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమానికి హాజరైన సీఐటీయూ మండల కార్యదర్శి బొనిగల అగస్టీన్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి కేవలం నాలుగు లేబర్ కోడ్‌లను తెస్తుందని, వాటికి నిరసనగా జూలై 9న దేశ వ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో సీఐటీయూ కీలక పాత్ర పోషిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేష్, యోహాను తదితరులు పాల్గొన్నారు.

### రేపల్లెలో...

రేపల్లె, మే 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజల పక్షాన నిలబడుతూ కార్మికుల సమస్యలపై సీఐటీయూ రాజీలేని పోరాటాలు చేస్తుందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ అన్నారు. సీఐటీయూ కార్యాలయం వద్ద శుక్రవారం 55వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్‌కోడ్ తీసుకురావటం కార్మికుల హక్కులను హరించటమేనన్నారు. ప్రభుత్వ బ్యాంక్‌లను కార్పొరేట్ బ్యాంకులకు అప్పజెప్పాలనుకోవడం ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ సీఐటీయూ నిరంతరం ఆందోళన చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ ఆటో, ముఠా, మున్సిపల్, రైస్‌మిల్ కాంట్రాక్టు ఉద్యోగులు, ఎంప్లాయిస్ నాయకులు రామకృష్ణప్రసాద్, కె.ఆశీర్వాదం, చిట్టిబాబు, డి.బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

## బేతపూడిలో స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమం

బాపట్ల రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం బేతపూడి గ్రామంలో స్వర్ణాంధ్ర... స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గ్రామంలోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ వద్ద బాపట్ల ఎంపీడీవో బి.బాబురావు సచివాలయ సిబ్బందితో కలిసి మొక్కలను నాటి నీరు పోశారు. అనంతరం గ్రామంలో గ్రామసభ నిర్వహించి ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్యక్రమాలు గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్తను విడివిడిగా అందించాలని, వీధులకు ఇరువైపుల చెత్త వేయరాదని గ్రామస్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మొక్కలు నాటి నీరు పోస్తున్న బాపట్ల ఎంపీడీవో బి.బాబురావు

## నీటి తీరువా వసూళ్ళకు రైతులు సహకరించాలి

పిట్టలవానిపాలెం, మే 30 (ఆంధ్రజ్యోతి) : నీటి తీరువా వసూళ్ళను రైతులు వీఆర్వోలకు చెల్లించి సహకరించాలని పిట్టలవానిపాలెం మండల తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. తహసీల్దార్ మాట్లాడుతూ మొత్తం నీటితీరువా లక్ష్యం 1434 ఫసలి నాటికి డిమాండ్ ఒక కోటి 28 లక్షల 44 వేల 949లు ఉండగా ప్రస్తుతం 29 లక్షల 50 వేల 729 రూపాయలు వసూళ్ళు అయ్యాయని మరింత వేగం పెంచి లక్ష్యాన్ని చేరుకోవాలని వీఆర్వోలను ఆదేశించారు.

## అంబులెన్స్ సేవలపై అవగాహన

బాపట్ల, మే 30 (ఆంధ్రజ్యోతి) : రాయల్ మెరైన్ ఇండస్ట్రీలో శుక్రవారం అంబులెన్స్ సేవలపై అవగాహన కల్పించారు. జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా ఇండస్ట్రీలోని సిబ్బందికి ప్రథమ చికిత్స మెళకువలు తెలియజేసి క్షతగాత్రులకు అందించే అత్యవసర సేవలు గురించి వివరించారు. శిక్షణ ద్వారా ప్రమాద సమయంలో ప్రాణ నష్టాన్ని నివారించవచ్చని శిక్షకులకు సూచించారు. కార్యక్రమంలో అంబులెన్స్ నిర్వాహకులు దివాకర్‌బాబు, రక్త నిల్వ కేంద్రం సాంకేతిక సిబ్బంది జాషువా, లావణ్య, సంస్థ హెచ్‌ఆర్ అనీల్‌కుమార్, రాయల్ మెరైన్ అధికారులు పాల్గొన్నారు.

## రేపల్లెలో సత్యా షోరూం ప్రారంభం

రేపల్లె, మే 30 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్స్ వస్తువుల విక్రయాల్లో ప్రసిద్ధిగాంచిన సత్యా ఏజెన్సీస్ తన 60వ షోరూంను రేపల్లెలోని మెయిన్‌రోడ్‌లో ప్రారంభించింది. ఈ షోరూంను శుక్రవారం భవన యజమాని వెంకటరమణ కుటుంబ సభ్యులు, సత్యా సేల్స్ ఏపీ హెడ్ సెంథిల్ తదితరులు లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీఎం సురేష్ మాట్లాడుతూ.. ఈ నెల 31వ తేదీ వరకు అన్ని గృహోపకరణాలపై 'సూపర్ సేల్ ఆఫర్' ఉందని, గరిష్ఠంగా 70 శాతం వరకు తగ్గింపు లభిస్తుందని తెలిపారు. ప్రతి కొనుగోలుపై ఖచ్చితంగా బహుమతి అందిస్తున్నామని వివరించారు.



షోరూంను ప్రారంభిస్తున్న వెంకటరమణ, సెంథిల్, సురేష్ తదితరులు

## నిబంధనల ప్రకారం తినుబండారాలు విక్రయించాలి



థియేటర్‌లో తినుబండారాల స్టాల్స్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు

రేపల్లె, మే 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సినిమా థియేటర్‌లలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం సినిమా టిక్కెట్లను, తినుబండారాలను విక్రయించాలని, ఎక్కువ రేట్లకు అమ్మితే ఉపేక్షించేది లేదని తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని బసవేశ్వర, రాజ్యలక్ష్మి థియేటర్‌లలో తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సినిమాహాల్స్‌లో ప్రేక్షకులకు తగ్గట్టుగా, నిబంధనలకు అనుగుణంగా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే అమ్మకాలు జరపాలని సూచించారు. థియేటర్లను పరిశుభ్రంగా ఉంచాలని యాజమాన్యానికి తెలిపారు. అదేవిధంగా సినిమా హాల్స్‌లో లైసెన్స్‌లు రెన్యువల్ చేసుకుని అగ్నిశాఖల అధికారుల అనుమతి తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పశుపోషకులకు రాయితీపై దాణా పంపిణీ



పశువుల దాణా పంపిణీ చేస్తున్న మురళీకృష్ణ

కొల్లూరు, మే 30 (ఆంధ్రజ్యోతి) : రాయితీపై పశుపోషకులకు దాణా పంపిణీ చేశారు. కొల్లూరులోని పశువైద్యశాలలో 20 టన్నుల సమీకృత పశువుల దాణా 50 శాతం రాయితీపై పశు వైద్యులు బట్టు యశ్వంత్ శుక్రవారం మండల టీడీపీ అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ చేతుల మీదుగా పశు పోషకులకు అందజేశారు. ఈ సందర్భంగా మైనేని మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం వ్యవసాయ అనుబంధ రంగంలోని వారికి ప్రాధాన్యత ఇచ్చి రాయితీపై పథకాలను అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, రైతులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## హిందూధర్మరక్షణకు కృషి చేయాలి

చెరుకుపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి) : ఛత్రపతి శివాజీ మహారాజ్ స్ఫూర్తిగా హిందూధర్మ రక్షణకు పాటుపడాలని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ శ్రీనివాసుల శ్రీనివాస్ అన్నారు. సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా సమావేశం శుక్రవారం మండలంలోని గుళ్ళపల్లి నూకాలమ్మ దేవస్థానంలో జరిగింది. ఆయన మాట్లాడుతూ జూన్ ఒకటి నుంచి 5వ తేదీ వరకు మండల సమావేశాలు, 14వ తేదీ సత్సంగం, 6, 23 తేదీలలో ఏకాదశి నగరసంకీర్తన, 9న హిందూ సామ్రాజ్య దినోత్సవం నిర్వహించాలన్నారు. జిల్లా మహిళా కన్వీనర్ బొలగాని విజయలక్ష్మి మాట్లాడుతూ 11న ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని అన్ని దేవాలయాలలో సామూహిక హారతులు మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించాలన్నారు. జిల్లా బాలవికాస్ కన్వీనర్ యల్లాప్రగడ సీతాపతి, జిల్లా ధర్మప్రచారక్ జంజనం హేమశంకరరావు, కన్వీనర్లు బొలగాని వెంకటేశ్వర్లు, పడమట వెంకటేశ్వరరావు, చిల్లా సత్యనారాయణ, ధర్మప్రచారకులు దండుప్రోలు వెంకటరావు, చింతల మురళికృష్ణ, తులసి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాలలో రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

కొల్లూరు, మే 30 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాలలో రికార్డులను కార్యకర్తలు సక్రమంగా నిర్వహించాలని సీడీపీవో విజయలక్ష్మి అన్నారు. కొల్లూరులోని ఎస్సీ కమ్యూనిటీ హాలులో శుక్రవారం నిర్వహించిన సెక్టార్ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ, కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రిజిష్టర్‌లను పూర్తి స్థాయిలో ఎప్పటికప్పుడు కేంద్రంలో దినసరి కార్యక్రమాలు నమోదు చేయాలన్నారు. ఆయా కేంద్రాల పరిధిలో చిన్నారులు, తల్లులు, బాలింతలను గుర్తించి నమోదు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఏసీడీపీవో విజయరాణి, సూపర్‌వైజర్ విజయలక్ష్మి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామ సమస్యలపై కలెక్టర్‌కు వినతి

భట్టిప్రోలు (కొల్లూరు), మే 30 (ఆంధ్రజ్యోతి) : భట్టిప్రోలు గ్రామ సమస్యలపై కలెక్టర్ కె.వెంకటమురళీకి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా శుక్రవారం వినతి పత్రం అందించారు. గ్రామంలో నెలకొన్న పలు సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్‌ను కలిసిన ఆయన ఆయా సమస్యల గురించి వివరించారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సాయిబాబాకు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో డొక్కు శ్రీనివాసరావు, అచ్చయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## 4న వెన్నుపోటు దినోత్సవం : మేరుగ

చెరుకుపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన రోజు జూన్ 4వ తేదీన వెన్నుపోటు దినోత్సవంగా పాటిస్తున్నామని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. గుళ్ళపల్లి వైసీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాల పేరుతో అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఎలాంటి పథకాలు అమలు చేయలేదన్నారు. రేపల్లె వైసీపీ సమన్వయకర్త ఈవూరి గణేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక నిరుద్యోగ శాతం పెరిగిందని, విద్యార్థులకు ఫీజు రీయింబర్సుమెంట్ అందించలేదన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ శ్రీరామమూర్తి, బాపట్ల జిల్లా జనరల్ సెక్రటరీ లుక్కా బాపనయ్య, గాలిమోటు రాజశేఖర్, దుండి వెంకటరామిరెడ్డి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యోగాతో ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చు

రేపల్లె, మే 30 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ యోగాపై అవగాహన పెంపొందించుకుని ఆసనాలు నిర్వహిస్తే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీవో శోభారాణి తెలిపారు. ప్రైవేటు అతిథిగృహంలో శుక్రవారం ఏర్పాటు చేసిన యోగా శిక్షణ శిబిరాన్ని ఆమె పరిశీలించారు. యోగా అధ్యాపకుడు, పట్టణవాసులు పాల్గొన్నారు.

## రెండో రోజుకు చేరుకున్న శిక్షణ

కర్లపాలెం, మే 30 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం లంక కాలువ సమీపంలోని పెనుమెత్స కోటంరాజు వెంచర్‌లో 11వ అంతర్జాతీయ యోగా శిక్షణ తరగతులు శుక్రవారంతో రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## కడప దర్గాలో ఎంపీ ప్రార్థనలు



ప్రార్థనలు చేస్తున్న ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, మాజీ ఎమ్మెల్యేలు చీరాల గోవర్ధనరెడ్డి, బాచిన చెంచు గరటయ్య తదితరులు

బాపట్ల, మే 30 (ఆంధ్రజ్యోతి) : కడపలో ప్రసిద్ధిగాంచిన దర్గాను ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ నాయకులతో కలిసి సందర్శించారు. దర్గా విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. అక్కడ ప్రార్థనలు చేసి ప్రజలంతా సుఖసంతోషాలతో, పాడిపంటలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు చీరాల గోవర్ధనరెడ్డి, బాచిన చెంచు గరటయ్య, పార్టీశ్రేణులు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదుల కార్యక్రమానికి 70 అర్జీలు

రేపల్లె, మే 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజాఫిర్యాదుల కార్యక్రమానికి 70 అర్జీలు అందాయని టీడీపీ రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి జీవీ నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాయలంలో శుక్రవారం ప్రజాఫిర్యాదుల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధిక సంఖ్యలో భూసమస్యలపై నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఎక్కువ ఫిర్యాదులు అందాయన్నారు. అదేవిధంగా రేషన్‌కార్డులకు, కొత్త పింఛన్‌లకు, నివేశన స్థలాలకు, గృహాలకు అర్జీలు దాఖలు చేసుకున్నారన్నారు. వచ్చిన ఫిర్యాదులన్నీ ఆయా కార్యాలయాలకు పంపించి సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొర్రా సూర్యరాజు, వడ్డి లక్ష్మీజీ, యరగళ్ళ ధర్మతేజ, నాగశ్రీ, తదితరులు పాల్గొన్నారు.




ప్రజాఫిర్యాదుల కార్యక్రమంలో అర్జీలను స్వీకరిస్తున్న టీడీపీ నాయకులు

## క్రికెట్ టోర్నమెంట్ విజేత వెల్లటూరు జట్టు

కొల్లూరు, మే 30 (ఆంధ్రజ్యోతి) : కొల్లూరు ప్రీమియర్ క్రికెట్ టోర్నమెంట్‌లో ఫైనల్ మ్యాచ్‌లో వెల్లటూరు జట్టు విజయం సాధించి కప్ గెలుచుకుంది. గత నెల రోజులుగా కొల్లూరులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో కొల్లూరు ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఫైనల్ మ్యాచ్‌లో శుక్రవారం వెల్లటూరు, కొల్లూరు టీమ్‌లు తలపడగా వెల్లటూరు జట్టు విజయం సాధించింది. నగదు బహుమతిగా రూ.50,016లు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తరుపున ఎంపీడీవో కె.నరసింహారావు, కార్యదర్శి మల్లిఖార్జునలు విజేత జట్టుకు కప్‌తో పాటు అందించారు. రన్నరప్‌గా నిలిచిన కొల్లూరు టీమ్‌కు ద్వితీయ బహుమతిగా రూ.30,016 మండల టీడీపీ అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ తరుపున జనసేన మండల అధ్యక్షుడు బొందలపాటి చలమయ్య అందజేశారు. తృతీయ స్థానంలో నిలిచిన దోనేపూడి జట్టుకు రూ.20,016లు తుమాటి శ్యాంబాబు తరుపున యడ్ల శ్రీనివాస్ అందజేశారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ సీరిస్‌కు ఎంపికైన వెల్లటూరు జట్టు క్రీడాకారులు పవన్‌కు ఎడమ హరికృష్ణ నగదు బహుమతి అందజేశారు. టోర్నమెంట్‌కు సహాయ, సహకారాలు అందించిన మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదనప్రసాద్, లీగ్ నిర్వాహకులు ఘంటా మహిధర్, నాగళ్ల యోగేంద్ర, తలశిల గోపి, పి.మణికంఠ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు పెదపూడి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



ఎంపీడీవో చేతుల మీదుగా కప్ అందుకుంటున్న వెల్లటూరు టీమ్

## నేడు పింఛన్లు పంపిణీ

భట్టిప్రోలు (కొల్లూరు), మే 30 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ భరోసా పింఛన్లు శనివారం పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో ఎస్.వెంకటరమణ శుక్రవారం తెలిపారు. జూన్ 1వ తేదీ సెలవు దినం కావడంతో మే 31న ఉదయం ఏడు గంటలకు సచివాలయ సిబ్బంది పింఛన్ లబ్ధిదారుల గృహాలకు వెళ్లి పింఛన్ సొమ్ము అందజేయనున్నట్లు చెప్పారు.

# భూ మాయకు పరిష్కారమేదీ?

- ప్రభుత్వ భూముల విస్తీర్ణం పెంపు
- పలు పేర్లతో వెబ్‌ల్యాండ్‌లో నమోదు
- బ్యాంకుల్లో తనఖా పెట్టి రుణాలు
- మాచవరంలో అక్రమార్కుల దోపిడీ..
- పరిశీలనతో కాలం వెళ్లదీస్తున్న అధికారులు
- ఏళ్లు గడుస్తున్నా వెబ్ ల్యాండ్‌లో తొలగని పేర్లు


మాచవరం తహసీల్దారు కార్యాలయం

మాచవరం, మే 30(ఆంధ్రజ్యోతి): సాధారణంగా జనాభా, ఆస్తుల విలువ పెరగడం సమాజంలో చూస్తుంటాం. కానీ, ఎక్కడా లేని విధంగా మాచవరం మండలంలో భూమి విస్తీర్ణం పెరగడం పెరిగింది. బ్రిటీషర్లు తయారు చేసిన ఆర్‌ఎస్‌ఆర్ రికార్డులను మార్చి భూముల విస్తీర్ణం పెంచడంలో ఇక్కడ పని చేసిన రెవెన్యూ అధికారులకే చెల్లింది. గత వైసీపీ ప్రభుత్వంలో మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ భూములతో పాటు ప్రైవేట్ భూముల విస్తీర్ణం పెంచి... ఇష్టానుసారం వెబ్ ల్యాండ్‌లో పేర్లు నమోదు చేయించుకొని.. బ్యాంకుల్లో రూ.లక్షల రుణాలు పొందారు. ఈ అక్రమాలు బయట పడినా.. సదరు వ్యక్తులపై చర్యలు తీసుకున్న పాపాన పోలేదు.

### మాచవరం రెవెన్యూ మాయ..

మాచవరం మండలంలో ఎక్కువగా ప్రభుత్వ భూములు ఉన్నాయి. ఇక్కడ రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో పని చేసిన అధికారులు ప్రభుత్వ భూములకు కూడా సర్వే సర్టిఫికెట్లు ఇచ్చి వెబ్ ల్యాండ్‌లో పేర్లు నమోదు చేశారు. సహజంగా పట్టా భూములు సర్వే చేసి సర్టిఫికెట్లు ఇస్తారు. కానీ, ఇక్కడ పనిచేసిన అధికారులు మాత్రం సర్వే నంబర్లతో సహా.. ప్రభుత్వ భూమి వివరాలను వారి అనుకూలమైన వ్యక్తులకు ఇస్తారు. సర్వే సర్టిఫికెట్‌తో పాటు వెబ్ ల్యాండ్‌లో నమోదు చేసే విధంగా బేర సారాలు కుదుర్చుకుంటారు.

### వెబ్‌ల్యాండ్‌లో విస్తీర్ణం పెంపు..

మండలంలోని వేమవరం, తాడుట్ల, పిన్నెల్లి, పిల్లుట్ల తదితర గ్రామ రెవెన్యూ శివార్లలో ఆర్‌ఎస్‌ఆర్ రికార్డు కంటే అడంగల్, వెబ్ ల్యాండ్‌లలో భూమి విస్తీర్ణం అమాంతంగా పెంచేశారు. ఉదాహరణకు వేమవరం రెవెన్యూ శివార్లలో 116 సర్వే నంబరులో మొత్తం విస్తీర్ణం 14 సెంట్లు ఉండగా.. అది కాస్త 9.52 సెంట్లు విస్తీర్ణంగా నమోదైంది. అసలు భూ యజమాని గుమ్మా నారాయణమ్మ కాగా.. వెబ్ ల్యాండ్‌లో వేమవరం గ్రామానికి సంబంధం లేని వారి పేర్లు కూడా నమోదై ఉన్నాయి. అదే విధంగా సర్వే నంబరు 126/1లో 56 సెంట్లు ఉండగా భూమి ఉండగా.. అది కాస్త 9.11 సెంట్లు వెబ్ ల్యాండ్‌లో నమోదైంది. ఇక్కడ కూడా ఈ గ్రామానికి సంబంధం లేని వారి పేర్లు నమోదు కావటం విశేషం. 385/2లో 2.68 సెంట్లు ఉండగా వెబ్ ల్యాండ్‌లో 20.53 సెంట్లుగా విస్తీర్ణం పెంచారు. 404/39లో 64.73 సెంట్లు ఉండగా దానిని 82.37 సెంట్లుగా నమోదు చేశారు. 404/43లో 104.42 సెంట్లు ఉండగా దానిని 116.48 సెంట్లుగా పెంచి వేశారు. ఇలా ఒకటి కాదు, రెండు కాదు అనేక సర్వే నంబర్లలో ఉన్న భూమి కంటే వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసిన విస్తీర్ణం అధికంగా ఉంది. దీనిని చూపించి, అక్రమార్కులు బ్యాంకుల్లో రుణాలు కూడా పొందారు.

### చర్యలు శూన్యం..

నమోదైన పేర్లు దొంగవి అని తెలిసినప్పటికీ అధికారులు రికార్డుల నుంచి తొలగించక పోవటం పలు అనుమానాలకు తావిస్తోంది. రెవెన్యూ అధికారులు ఆయా గ్రామాల్లో సర్వే నిర్వహించి, పరిశీలన అనంతరం ఆయా పంచాయతీ కార్యాలయాల్లోని నోటీసు బోర్డుల్లో జాబితాలను ప్రదర్శించి చేతులైతే దులుపుకున్నారు కానీ.. అక్రమ పేర్లను వెబ్‌ల్యాండ్ నుంచి తొలగించడంలో ఎందుకు అశ్రద్ధ వహిస్తున్నారో.. వారికే తెలియాలి. అంతేగాకుండా మాచవరం మండలంలో ముంపునకు గురైన పులిచింతల ప్రాజెక్టు కింద పొలాలనూ కూడా వెబ్‌ల్యాండ్‌లో చూపించి.. ఆయా గ్రామాల బ్యాంకుల్లో లక్షలాది రూపాయల రుణాలు తీసుకున్న దాఖలాలు కోకొల్లలు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు భూ మాయ పై లోతుగా విచారణ జరిపి.. అక్రమంగా వెబ్ ల్యాండ్‌లో నమోదు చేసిన పేర్లు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

### రీ సర్వేలో తొలగిపోతాయి



వెబ్ ల్యాండ్‌లో అక్రమ పేర్లు త్వరలో జరగనున్న భూ రీ సర్వేలో తొలగిపోతాయి. త్వరలో వేమవరం గ్రామంలో రీ సర్వే జరుగుతుంది. ఆర్‌ఎస్ ఆర్ దాఖలా కంటే ఎక్కువ విస్తీర్ణం కలిగిన దొంగ పేర్లను తక్షణమే తొలగిస్తాం.

- నాగ మల్లేశ్వరరావు, తహసీల్దార్, మాచవరం

## అతివలకు డిజిటల్ లక్ష్మీ కటాక్షం


శిక్షణలో పాల్గొన్న డ్వాక్రా మహిళలు

సత్తెనపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): ఎంతో మంది డ్వాక్రా మహిళలు, స్థానికులు ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలను పొందే మార్గం తెలియక, దరఖాస్తు ఎలా చేయాలో అవగాహన లేక ఇబ్బందులు పడుతన్నారు. దీనిని ఆసరగా చేసుకొని కొందరు మధ్యవర్తులు వారి నుంచి దరఖాస్తు, ఆన్‌లైన్ సేవలకు అధిక మొత్తంలో డబ్బులు తీసుకుంటున్నారు. ఈ సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం 'డిజిటల్ లక్ష్మి' సేవలను అందుబాటులోకి తీసుకొస్తోంది. కంప్యూటర్ పరిజ్ఞానం ఉండి, డిగ్రీ పూర్తి చేసిన డ్వాక్రా మహిళలను గుర్తించి డిజిటల్ లక్ష్మిగా ఎంపిక చేస్తున్నారు. వారికి ఉపాధి కల్పించి ఆర్థిక చేయూత అందించడంతో పాటు.. ప్రజలకు సేవలందించేలా ప్రణాళిక రూపొందించింది. దీనిలో భాగంగా సత్తెనపల్లి పట్టణంలో 21, వినుకొండలో 15, గురజాలలో ఐదుగురు, దాచేపల్లిలో ఎనిమిది మంది, పిడుగురాళ్లలో 18, నరసరావుపేటలో ఏడుగురు, మాచర్లలో 13, చిలకలూరిపేటలో 13 మందిని నేటికి డిజిటల్ లక్ష్మీలుగా ఎంపిక చేసి, వారి నుంచి దరఖాస్తులు స్వీకరించింది. వారికి ఆయా పురపాలక సంఘ కార్యాలయాల్లో శిక్షణ కూడా ఇస్తోంది. మీ-సేవా కేంద్రం మాదిరిగా డిజిటల్ లక్ష్మిలు సేవలందించనున్నారు. తమ ఇంటి ముందే కొద్ది పాటి స్థలం ఉంటే దుకాణాన్ని పెట్టుకొనేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఇందుకు రూ.2లక్షల వరకు బ్యాంక్ రుణం ఇవ్వనున్నారు.

## శారీరక దృఢత్వానికి క్రీడలు దోహదం


టెన్నిస్ ఆడుతున్న ఏసీబీ డైరెక్టర్ జయలక్ష్మి

గుంటూరు(తూర్పు), మే 30(ఆంధ్రజ్యోతి): శారీరక దృఢత్వానికి క్రీడలు దోహదం చేస్తాయని ఏసీబీ డైరెక్టర్ ఆర్.జయలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక బీఆర్ స్టేడియంలో మూడు రోజుల పాటు జరిగే ఓపెన్ టెన్నిస్ పోటీలను శుక్రవారం ఆమె ప్రారంభించి, మాట్లాడారు. పిల్లల్లో క్రీడల పట్ల ఆసక్తి పెంచేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. క్రీడలకు దూరంగా ఉండటంతో చిన్నవయస్సులోనే ఊబకాయం బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మరో అతిథి అటవీ చీఫ్ కన్జర్వేటర్ బీఎస్ఎస్ మూర్తి మాట్లాడుతూ మౌలిక సదుపాయాలను కల్పిస్తే ఏ పీ టెన్నిస్ హబ్‌గా ఆవిర్భవిస్తుందన్నారు. టోర్నమెంట్ డైరెక్టర్ నాగేంద్ర మాట్లాడుతూ అండర్ 16 విభాగంలో బాల బాలికలకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీలకు సహకరించిన సీనియర్ టెన్నిస్ ఆటగాడు ఎస్ రామకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర సమాచార కమిషనర్ పి.శామ్యూల్ జోనాథన్, డీఎస్‌డీఓ నరసింహారెడ్డి, సీనియర్ టెన్నిస్ కోచ్‌లు బి.సాయి, అలపాటి సురేష్, అహ్మద్ పాల్గొన్నారు.

# యోగాసనం..ఆరోగ్యానికి శాసనం



- యోగాపై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి
- శారీరక ఆరోగ్యం, మనసుకు ఆనందం
- యోగాంధ్ర నిర్ణయంపై ప్రజల్లో హర్షం
- నెల రోజులు యోగాపై విస్తృత ప్రచారం
- జూన్ 21న విశాఖలో అంతర్జాతీయ యోగా దినోత్సవం

గుంటూరు, మే 30(ఆంధ్రజ్యోతి): యోగా.. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషించే ఆయుధం. దీని వల్లనే వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ యోగాపై మక్కువ చూపుతున్నారు. యోగాసనాలకు కోసం కొంత సమయం కేటాయిస్తున్నారు. ఫలితంగా శిక్షకులు, యోగా కేంద్రాల సంఖ్య కూడా పెరుగుతోంది. రోగాలను రూపుమాపే




అద్భుతమైన శక్తి యోగాకు ఉందని ప్రపంచ వ్యాప్తంగా నమ్ముతున్నారు. దీర్ఘకాలిక రోగాలు తగ్గుతున్నాయన్న ప్రచారం కూడా ఉంది. మొత్తమ్మీద మన జీవితంలో ఇప్పుడు యోగ బాగమైంది. యోగాను తన దైనందిన జీవితంలో నిత్య కృత్యంగా మార్చుకున్నందు వల్లే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ వయసులో కూడా అలసట, అలుపు లేకుండా ఆరోగ్యవంతుడిగా ఉంటున్నారు. యోగా గొప్పతనాన్ని గుర్తించడం వల్లే.. యోగా పట్ల అందరూ ఆకర్షితులయ్యేలా చేయాలని ఆయన కంకణం కట్టుకున్నారు. అందుకే జూన్ 21న విశాఖలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని గొప్పగా నిర్వహించి, యావత్ దేశం దృష్టిని ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ రోజు నుంచే రాష్ట్రంలోని ప్రతి కుటుంబం యోగాను ఆచరించేందుకు ప్రయత్నించాలని మహానాడు వేదికగా ఆయన పిలుపునిచ్చారు.

### నెల రోజులు రాష్ట్రంలో విస్తృత ప్రచారం

జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని నెల రోజుల పాటు యోగాంధ్ర పేరుతో రాష్ట్రంలో విస్తృత ప్రచారం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో రెండు కోట్ల మందిని భాగస్వాములు చేయాలనేది ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచన. విశాఖలో నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రత్యక్షంగా ఏడు లక్షలు మంది పాల్గొనేలా ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. అందులో భాగంగా ప్రతి గ్రామంలోనూ యోగా దినోత్సవాన్ని నిర్వహించాలని ప్రభుత్వం పిలుపునిచ్చింది. యోగా ప్రాధాన్యతను ప్రజలకు వివరించే బాధ్యత ఉన్నతాధికారులకు అప్పగించారు.

### పెరిగిన ప్రాధాన్యం

ఒత్తిడితో కూడిన యాంత్రిక జీవితంలో యోగా ప్రాధాన్యం పెరిగింది. ప్రస్తుతం జిల్లాలో యోగాను అభ్యసిస్తున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంది. ఆ సంఖ్యను మరింతగా పెంచాలని చెబుతున్నారు. ముఖ్యంగా యువత, మహిళలు యోగా పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచిస్తున్నారు. వైద్య నిపుణులు కూడా యోగా చేయాలని చెబుతున్నారు.

## ఆసనాలు, ఉపయోగాలు..

**భుజంగాసనం**

పాము పడగ విప్పినట్లు ఆకారం కలిగిన ఈ ఆసనం వేయడంతో చాతి భాగం విప్పారుతుంది. ఊపిరితిత్తులు బలపడతాయి. వెన్ను దృఢంగా ఉంటుంది. నడుం నొప్పి తగ్గుతుంది. ఈ ఆసనంతో ఎముకలకు బలం చేకూరుతుంది.

**ధనురాసనం**

ధనుస్సును పోలిన ఈ ఆసనం ఎత్తు పెరిగేందుకు ఉపయోగపడుతుంది. కీళ్ల సంబంధ వ్యాధులు తగ్గుతాయి. మలబద్ధకం పోతుంది. షుగర్ నియంత్రణలో ఉంటుంది. ముఖ్యంగా యువత ఈ ఆసనం నేర్చుకోవాలి.

**పశ్చిమోత్తాన ఆసనం**

ఈ ఆసనం ద్వారా పొట్ట సంబంధ వ్యాధులు తగ్గుతాయి. జననాంగాలకు వ్యాధుల నుంచి ఉపశమనం లభిస్తుంది. మహిళలు, వృద్ధులు అభ్యసించాలి.

**ఓస్త్రాసనం**

ఒంటె ఆకారాన్ని పోలిన ఈ ఆసనం వల్ల నడుం నొప్పి తగ్గి, వెన్ను సామర్థ్యం పెరుగుతుంది. సర్వే కాల్ స్పాండిలైటిస్ బాధ పడే వారికీ ఈ అసనం ఎంతో ఉపయోగం.

**శవాసనం**

దీనిని అమృతాసనం అని కూడా పిలుస్తారు. ఆసనాల ప్రారంభంలోనూ, మధ్యలోనూ, పూర్తయిన తర్వాత కూడా దీనిని వేసుకోవాలి. దీంతో శరీరానికి ప్రశాంతత లభిస్తుంది. అన్ని వయసుల వారూ ఆచరించవచ్చు.

**శశాంకాసనం**

చంద్రుని ముఖం వలె ప్రకాశించే రూపును కలిగించే ఈ ఆసనంతో తలనొప్పి ఒత్తికి తగ్గుతుంది. ఉపిరితిత్తులకు ప్రాణ వాయువు అందజేస్తుంది. కోపం వంటివి మెల్లగా తగ్గుముఖం పడతాయి. బీపీ, బ్రెయిన్ స్ట్రోక్ వంటి వ్యాధులతో బాధపడేవారు ఈ ఆసనాన్ని ఆచరించవచ్చు.

**త్రిభుజాసనం**

ఇది వెన్నుముకను, కాళ్లను సాగదీస్తుంది, నడుము, భుజాలను బలంగా మారుస్తుంది.

**భుజంగ ఆసనం**

ఇది వెన్నుముకను పైకి ఎత్తి, కడుపు, చాతి కండరాలను బలపరుస్తుంది.

**అధోముఖ స్వ నా ఆసనం**

ఇది మొత్తం శరీరానికి బలం వశ్యతను ఇస్తుంది, నడుమును చేతులను సాగదీస్తుంది.

**తలాసనం**

ఇది మెదడుకు, శరీరం మొత్తానికి బలం చేకూరుస్తుంది. ముఖ్యంగా మెదడు చురుగ్గా పనిచేస్తుంది.

**గరుడాసనం**

శరీరానికి సమతుల్యతను చేకూరుస్తుంది. ముఖ్యంగా దీర్ఘకాల వ్యాధుల నివారణకు ఈ ఆసనం ఆచరించవచ్చు.



## 80 ఏళ్ల వయసులోనూ..

గుంటూరు బ్రాడీపేటలో స్థిర నివాసం ఏర్పరచుకొని.. యోగా శిక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తున్న డాక్టర్ జైహింద్ ఎనిమిది పదుల వయసులోనూ క్లిష్టతరమైన ఎన్నో ఆసనాలు వేసి అందరిని అబ్బుర పరుస్తున్నారు. 2001లో జైహింద్ దంపతులు యోగా పట్ల ఆకర్షితులయ్యారు. దాని గొప్పతనాన్ని గుర్తించి అందరిని ఆరోగ్యవంతులుగా చేయాలనే సంకల్పంతో 2006లో గుంటూరులో శిక్షణ కేంద్రం ప్రారంభించారు. వాస్తవానికి వీరి స్వస్థలం బాపట్ల జిల్లా మార్టూరు మండలంలోని ద్రోణాదుల గ్రామం. కానీ, ఎన్నో దశాబ్దాలుగా ఇక్కడే స్థిరపడిపోయారు. ఆయన సతీమణి సుబ్బాయమ్మ కూడా యోగ విద్యలో పేరు గడించారు. విశేషమేమిటంటే యోగాతో చేకూరిన ఆరోగ్యంతో దంపతులిద్దరూ వెటరన్ క్రీడల్లో కూడా రాణించి ఎన్నో పతకాలు సాధించారు.

### యోగా నియమాలు ఇలా

- సాధకులు విధిగా ప్రార్థనతో ప్రారంభించి..ముగించాలి.
- ఆందోళన, అలసట, ఆకలి ఉన్నపుడు యోగాకి దూరంగా ఉండాలి.
- ఆసనాల ముందు నీరు తాగితే మంచిది. తేలికైన వస్త్రాలు ధరించాలి.
- రుతుక్రమ సమయంలో మహిళలు యోగాకి దూరంగా ఉంటే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.
- గర్భిణులు మొదటి నాలుగు నెలలు శిక్షకుల పర్యవేక్షణలో అసనాలు వేయొచ్చు.

# అతిథులు.. వెళ్లిపోతున్నారు!

**ఉప్పలపాడు పక్షుల కేంద్రం కళావిహీనం**

- ఆలనాపాలనా చూసేవారు కరువు
- గుర్రపు డెక్కతో నిండిపోయిన చెరువు
- నీరు లేక విడిది మార్చుకుంటున్న వలస పక్షులు
- కన్జర్వేషన్ రిజర్వుగా గుర్తింపుతోనే సరి..
- వాచ్‌మన్‌కు పది నెలలుగా జీతం ఇవ్వని దుస్థితి


ఉప్పలపాడు పక్షుల కేంద్రంలో ఏపుగా పెరిగిన గుర్రపు డెక్క



గుంటూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ పక్షులకు విడిదిగా ఆశ్రయం కల్పిస్తున్న ఉప్పలపాడు పక్షుల కేంద్రానికి ఆలన పాలన కరువైంది. ఈ కేంద్రాన్ని పర్యవేక్షిస్తున్న గ్రామ పర్యావరణ అభివృద్ధి కమిటీ నిధుల కొరతతో సతమతమవుతోంది. కనీస నిర్వహణ కూడా చేయలేని పరిస్థితి నెలకొంది. పక్షులకు నీరు లభ్యం కాక పోతుండంతో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోతున్నాయి. సుమారు 10 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మంచినీటి చెరువు పూర్తిగా గుర్రపు డెక్కతో నిండిపోయింది. దీంతో పక్షులకు ఎలాంటి ఆహారం లభించడం లేదు. ఒకప్పుడు స్థానిక పర్యాటకులనే కాకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన వారిని కూడా ఆకర్షించిన ఈ పక్షి కేంద్రం నేడు దయనీయమైన స్థితికి చేరుకుంది. అవసరం లేని పనులకు దుబారగా నిధులు ఖర్చు చేసే ప్రభుత్వ శాఖలు జీవ వైవిధ్యానికి మారుపేరు అయిన ఈ పక్షుల కేంద్రానికి రూపాయి కూడా వెచ్చించకపోవడం దారుణం.

### పలు దేశాల పక్షుల విడిది..

ఉప్పలపాడులోని మంచినీటి చెరువుకు పాతికేళ్ల క్రితం నుంచే వివిధ దేశాల నుంచి పక్షులు వలస వచ్చేవి. ఇక్కడ వాతావరణం అనుకూలంగా ఉండటంతో సైబీరియా, ఆస్ట్రేలియా లాంటి దేశాల నుంచి కూడా వేల కిలోమీటర్ల దూరం ప్రయాణించి పక్షులు విడిదికి వచ్చేవి. మొదట్లో అటవీ శాఖ ఆధీనంలో ఈ కేంద్రం ఉండేది. ఆ తర్వాత గ్రామ పర్యావరణ అభివృద్ధి కమిటీ ఆధీనంలోకి తీసుకొంది. ఇక్కడ చెరువులో ఉన్న చెట్లపై గుడ్లు పెట్టేందుకు.. వాటిని పొదిగేందుకు పక్షులకు అనువైన వాతావరణం ఉంది. చైనా, నేపాల్, హిమాలయాల నుంచి పెలికాన్స్, నైజీరియా నుంచి పెయింటెండ్ స్టార్క్స్, శ్రీలంక, ఆఫ్రికా నుంచి ఓపెన్ బిల్ స్టార్క్స్, దక్షిణాఫ్రికా నుంచి వైట్ ఐబిస్ వంటి పక్షులు వస్తుంటాయని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. చెరువుకు సమీపంలో మాగాణి ఉండటంతో వాటికి వ్యాపించే చీడపీడలను ఇవి ఆహారంగా తీసుకొంటాయి. ఎక్కువగా శీతాకాలంలో పక్షులు ఇక్కడకి వస్తుంటాయి. కొన్ని నెలల పాటు ఇక్కడే ఉండి గుడ్లు పెట్టి పొదిగి పిల్లలకు ఎగరడం వచ్చే వరకు ఆలనపాలన చూస్తుంటాయి.

### తగ్గిన పర్యాటకుల సంఖ్య

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పర్యాటక శాఖ ఈ కేంద్రాన్ని తనకు స్వాధీనం చేయాలని కూడా కోరింది. అయితే అందుకు అటవీ శాఖ ససేమిరా అంది. రకరకాల రంగురంగుల పక్షులను చూసేందుకు నిత్యం వందల సంఖ్యలో పర్యాటకులు పక్షుల కేంద్రానికి వస్తుంటారు. సాయంత్రం వరకు ఆస్వాదించి వెళ్తుంటారు. ఇప్పుడు ఆ పరిస్థితి భూతద్దం పెట్టి వెతికినా కనిపించడం లేదు. కేవలం ఆదివారం మాత్రమే అడపాదడపాగా పర్యాటకులు వస్తున్నారు. పర్యాటకులు ఆస్వాదించేందుకు తగిన సదుపాయాలు లేకపోవడం, చెరువు అంతా గుర్రపు డెక్క పెరిగి పక్షుల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడంతో ఒకసారి ఇక్కడికి వచ్చిన వాళ్లు మళ్లీ రావాలని కోరుకోవడం లేదు. దీంతో ఉప్పలపాడు పక్షుల కేంద్రం కళావిహీనంగా మారిపోతోంది. వాచ్‌మెన్‌కు పది నెలలుగా జీతం లేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఒక అవగాహనకు రావొచ్చు. కాగా జిల్లా యంత్రాంగం దీనిని కన్జర్వ్ రిజర్వుగా ప్రకటించేందుకు చర్యలు చేపట్టింది. అంతమాత్రాన ఈ కేంద్రానికి ఎలాంటి ఉపయోగం ఉండదు. దీనికి ఏటా బడ్జెట్‌లో నిధులు కేటాయించి నిర్వహణ సక్రమంగా చేస్తేనే పూర్వవైభవం వస్తుంది. లేకుంటే రాబోయే రోజుల్లో ఇదొక పాడుబడిన చెరువులా మారిపోయే ప్రమాదం పొంచి ఉంది.

### ఎంపీలు, ఎమ్మెల్యేలు నిధులు కేటాయించాలి

గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఉన్న ఉప్పలపాడు పక్షుల కేంద్రానికి ప్రధానంగా గుంటూరు, విజయవాడ, మంగళగిరి-తాడేపల్లి నగరాల నుంచి పర్యాటకులను ఆకర్షించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు తమకు ఏటా వచ్చే నిధుల్లో కొంత పక్షుల కేంద్రానికి కేటాయించి అభివృద్ధి పనులు చేపడితే.. పూర్వవైభవం తీసుకురావొచ్చు. ప్రస్తుతం వేసవికాలం కానున్న దృష్ట్యా సీఎస్ఆర్(కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) ఫండ్స్ అయినా కేటాయించి గుర్రపు డెక్కని పూర్తిగా తొలగిస్తే వర్షాకాలంలో చెరువుని పూర్తిస్థాయిలో మంచినీటితో నింపొచ్చు. దాంతో పక్షులు రావడానికి అనువైన వాతావరణం ఏర్పడుతుంది.

## అవీ..ఇవీ..

### ఇద్దరు వ్యక్తుల మధ్య కొట్లాట

● ఒకరికి గాయాలు

మార్కాపురం, మే30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నారికట్ల గ్రామంలో దుద్దు ప్రసన్నబాబు, దుద్దు నాగరాజు అనే ఇద్దరు వ్యక్తుల మధ్య శుక్రవారం కొట్లాట జరిగింది. దీంతో గాయపడిన ప్రసన్నబాబును కుటుంబసభ్యులు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి 108 వాహనంలో తరలించారు. వీరి మధ్య గొడవకు కారణాలు తెలియలేదు.

### ఇంటి విషయంలో వివాదం

● రాయి విసరడంతో వృద్ధుడికి గాయాలు

అద్దంకి, మే30 (ఆంధ్రజ్యోతి): ఇంటి వివాదం విషయంలో వ్యక్తిపై రాయితో దాడి చేయడంతో మరో వ్యక్తి గాయపడిన ఘటన అద్దంకి పట్టణంలోని కాకానిపాలెంలో చోటుచేసుకుంది. అద్దంకి పట్టణంలోని కాకానిపాలెంలో కోటిరెడ్డి సుమారు దశాబ్దకాలం క్రితం దొడ్డపాటి ఆశోక్, జగదీశ్‌ల నుంచి ఇళ్లు కొనుగోలు చేశారు. అయితే ఇంటిలో కొంత వాటా ఉందని ఆశోక్, జగదీశ్ సోదరితో వివాదం కొనసాగుతుంది. దీంతో ఇటీవల గాలులకు ఇంటిపక్కు రేకులు లేచిపోయాయి. గురువారం కోటిరెడ్డి పైకెక్కి సరిచేస్తున్నారు. దీంతో ఆశోక్, జగదీశ్ సోదరి భర్త అమ్మతరావు వెళ్లి కోటిరెడ్డిని కిందకు దిగమని కోరాడు. దిగకపోవటంతో రాయి విసిరాడు. దీంతో కోటిరెడ్డికి గాయాలయ్యాయి. వైద్యశాలలో చికిత్స పొందుతున్న కోటిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

### రేషన్ పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు : తహసీల్దార్

పంగులూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించతున్న రేషన్‌పంపిణీలో ఎలాంటి అవతవకలు జరిగినా కఠిన చర్యలుంటా యని తహసీల్దార్ సింగారావు హెచ్చరించారు. జూన్ ఒకటి నుండి రేషన్ దుకాణాల నుంచి కార్డుదారులకు నేరుగా రేషన్ పంపిణీ జరుగుతుందన్నారు. శుక్రవారం తహసీల్దార్ సింగారావు, ఆర్ఐ శ్రీతేజ పలు రేషన్‌దుకాణాల తనిఖీ నిర్వహించారు. లబ్ధిదారులను గుర్తించే ఈ పాస్ మిషన్ల పరిశీలనతో పాటు, నేమ్ బోర్డులు, స్టాక్ నమోదు బోర్డుల ఏర్పాటును తనిఖీ చేశారు. మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలో 14,896 కుటుంబాలు తెల్లరేషన్ కార్డులు కలిగి ఉన్నారన్నారు. 34 రేషన్ దుకాణాల ద్వారా కార్డుదారులకు రేషన్ అందజేయనున్నట్లు తెలిపారు. ప్రతి నెల ఒకటవ తేదీ నుంచి 18వ తేదీ వరకు నిర్ణీత సమ యాలలో రేషన్ అందచేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.



దుకాణాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్

### క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలి

● పర్చూరులో జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని అలవర్చుకొని ముందుకు సాగాలని ఎమ్మెల్యే ఏలూరి అన్నారు. పర్చూరు వైఎస్‌ఆర్ సమీపంలోని ఎస్‌వీ క్రికెట్ క్రీడాప్రాంగణంలో జిల్లాస్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలు శుక్రవారం ఎమ్మెల్యే రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యతోపాటు, క్రీడల్లో కూడా ప్రతిభను కనపర్చే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్న విషయాన్ని గుర్తించాలన్నారు. అనంతరం టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో తులసి శ్రీనివాసరావు, ఇనగంటి నాగార్, తోట మణి, పఠాన్ సమీర్, తులసి రాజేష్, కొసనా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### రేషన్ షాపుల పరిశీలన

స్వర్ణ(పర్చూరు), మే 30 (ఆంధ్రజ్యోతి) : కారంచేడు మండలం స్వర్ణ గ్రామంలో తహసీల్దార్ నాగరాజు ఆధ్వర్యంలో అధికారులు రేషన్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ నెల 1 నుంచి రేషన్ దుకాణాల్లోనే సరుకులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రతి రేషన్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తామన్నారు. అక్రమాలకు పాల్పడిన రేషన్ దుకాణదారులపై చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### ఆన్‌లైన్ లావాదేవీలపై అప్రమత్తం

● డీఎస్పీ ఎండీ మొయిన్

విజయనగర్‌కాలనీ(చీరాల), మే 30 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల పట్ల జాగ్రత్తలు పాటించాలని డీఎస్పీ ఎండీ మొయిన్ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి మండల పరిధిలోని విజయనగర్ కాలనీలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అందరూ స్నేహభావంతో మెలగాలని, ప్రశాంత వాతావరణం ఉండేలా చూసుకోవాలన్నారు. అలాగే ఆండ్రాయిడ్ ఫోన్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. డీఎస్పీ వెంట సీఐ నాగభూషణం తదితర సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

### కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయాలి

● ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు

కారంచేడు (పర్చూరు), మే 30 (ఆంధ్రజ్యోతి) : జూన్ 5న కారంచేడు ప్రైమరీ హెల్త్ సెంటర్ నందు జరిగే రాష్ట్రస్థాయి 3వ కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని బాపట్ల జిల్లా ఉద్యోగుల సంఘం కార్యదర్శి పసుపర్తి శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం స్థానిక ప్రైమరీ హెల్త్ సెంటర్ ప్రాంగణంలో కౌన్సిల్ సమావేశంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షన్ దారులు అందరూ కలసి కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సుబ్బారావు, ఆంజనేయులు, ఫార్మసిస్ట్ పోసాని మాధవి, సుజాత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు

# జడ్పీ నిధులతో అభివృద్ధికి బాటలు

● జిల్లాపరిషత్ నుంచి రూ.93.50 లక్షలు విడుదల ● ఫలించిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కృషి

పర్చూరు, చినగంజాం, మే 30(ఆంధ్రజ్యోతి) : పర్చూరు నియోజకవర్గ అభివృద్ధికి జిల్లా పరిషత్ జనరల్ ఫండ్ నుంచి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు విడుదల అయ్యాయి. రూ.93.50 లక్షలు విడుదల చేస్తూ జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి ఉత్తర్వులు జారీ చేశారు.నియోజకవర్గంలో 19 పనులకు రూపాయల నిధులు మంజూరు చేశారు. నిధుల కోసం ఎమ్మెల్యే చేసిన కృషి ఫలించింది.



చింతగుంపల్లె ఎస్సీ శ్మశాన వాటిక

ప్రధానంగా గ్రామాల్లోని హిందూ, ముస్లిం, ఎస్సీ శ్మశాన వాటికలు, గ్రామీణ ప్రాంతాల్లో లింకురోడ్లు శ్మశానాల ప్రహరీ నిర్మాణాలు, మంచినీటి వసతికి నిధులు విడుదల చేశారు. మార్టూరు మండలం వలపర్ల గ్రామంలో హిందూ శ్మశాన వాటిక నిర్మాణానికి రూ.10 లక్షలు, మార్టూరు గ్రామంలోని బండి నాగేశ్వరరావు కాలనీలోని ఎస్సీ శ్మశాన వాటికకు రూ.10 లక్షలు, యద్దనపూడి గ్రామంలో పెంట్యాల వెంకటేశ్వర్లు ఇంటి నుంచి సైదులు ఇంటి వరకు రూ.5 లక్షలతో గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. యద్దనపూడి మండలంలోని గన్నవరంలో రమణాయ కుంట గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు, పర్చూరు మండలం నాగులపాలెం ముస్లిం శ్మశానవాటిక ప్రహరీగోడ నిర్మాణానికి రూ.10 లక్షలు, గొల్లపూడి గ్రామంలో ఎస్సీ కాలనీ మంచినీటి వసతికి రూ.3 లక్షలు, ఉప్పుటూరు గ్రామంలో హోమియోపతి వైద్యశాల భవనం నిర్మాణానికి రూ.10 లక్షలు, ఇంకొల్లు మండలం పూసపాడు గ్రామంలో బాపినీడు కుంట గ్రావెల్ రోడ్డుకు రూ.4 లక్షలు, పూసపాడులోని ఆర్అండ్‌బీ రహదారి నుంచి వయా తిమ్మిడితపాడు గ్రావెల్ రోడ్డుకు రూ.5 లక్షలు, పూసపాడులోని ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి స్వర్ణ కెనాల్ గ్రావెల్ రోడ్డుకు రూ.5 లక్షలు, చినగంజాం మండలం చింతగుంపల్లె గ్రామంలోని హిందూశ్మశాన వాటికకు రూ.5 లక్షలు, ఎస్సీ శ్మశాన వాటికకు రూ.5 లక్షల రూపాయలు, కడవకుదురు ఒంగోలు, చీరాల డొంక రోడ్డు గ్రావెల్ నిర్మాణానికి రూ.5 లక్షలు, కారంచేడు ముస్లిం శ్మశానవాటిక ప్రహరీగోడ నిర్మాణానికి రూ.10 లక్షలు, కారంచేడు కుంట డొంక రోడ్డు గ్రావెల్ నిర్మాణానికి రూ.5 లక్షలు నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు.



అభివృద్ధి చేయనున్న చింతగుంపల్లె హిందూశ్మశాన వాటిక

**అభివృద్ధిపై ఎమ్మెల్యే దృష్టి**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్యే ఏలూరి అభివృద్ధి, సంక్షేమంపై ప్రత్యేక దృష్టిసారించారు. ప్రభుత్వంలో మంత్రులతో తనకున్న పరిచయం, ప్రభుత్వ సహకారంతో అభివృద్ధికి నిధులు భారీగా తీసుకొస్తున్నారు. ప్రజా సంక్షేమం అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారు. ప్రస్తుతం జడ్పీ నిధుల మంజూరుపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# అద్దంకి కొండవద్ద ఎట్టకేలకు చెత్త తొలగింపు

అద్దంకి,మే30(ఆంధ్రజ్యోతి): అద్దంకి మున్సిపాలిటీలో దశాబ్ద కాలంగా సేకరించిన చెత్తను అద్దంకి కొండ వద్ద టిడ్కో ఇళ్ల సమీపంలో గోతులలో వదిలేశారు. దీంతో ఆటు వైపు వెళ్లాలంటేనే ముక్కులు మూసుకోవాల్సిన పరిస్థితి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పేరుకుపోయిన చెత్త తొలగింపునకు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా డ్రోన్‌తో సర్వే చేయగా 58 వేల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయినట్లు గుర్తించారు. చిలకలూరిపేట కు చెందిన తరుణి ఎజెన్సీ ద్వారా చెత్త తొలగించి శుభ్రం చేసే పనులు ప్రారంభించారు. అద్దంకి కొండ వద్ద ఉన్న చెత్తను ఎస్కవేటర్‌తో తిరగతోడుతున్నారు. చెత్త తిరగతోడిన తరువాత రసాయనాలు పిచికారి చేసి 15 రోజుల తరువాత ఎరువు తయారు అవుతుంది. కుళ్లి పోకుండా ఉన్న పదార్థాలను వేరు చేస్తారు. వీటిని గుంటూరులోని జిందాల్ కు తరలిస్తారు. అక్టోబర్ 2వ తేది నాటికి చెత్త పేరుకు పోయిన సుమారు నాలుగైదు ఎకరాల ప్రాంతాన్ని శు భ్రం చేయాల్సి ఉంది. చెత్త తొలగించిన ప్రాంతంలో సరదవనం లేదా పార్కు ను అభివృద్ధి చేసే అవకాశం ఉంది. గతంలో పేరుకు పోయిన చెత్త తొలగింపు తో పాటు ప్రస్తుతం రోజువారి అద్దంకి పట్టణంలో సేకరిస్తున్న చెత్త ను ఎప్పటికప్పుడు గుంటూరులోని జిందాల్ కు పంపుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ రవీం ద్ర తెలిపారు.



చెత్తను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

## ఇద్దరికి కరోనా

(3వ పేజీ తరువాయి)

వర్గాలు వెల్లడించాయి.

**రోగులు మాస్కులు ధరించాలి..**

దగ్గు, తుమ్ములతో బాధపడే వారు తప్పనిసరిగా మాస్కులు ధరించాలని వైద్య వర్గాలు కోరాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో కొవిడ్-19 కేసులు ప్రబలుతున్న నేపథ్యంలో గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్సలకు వచ్చే వారు తప్పనిసరిగా మాస్కులు ధరించి రావాలని శుక్రవారం సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి సూచనలు చేశారు. జ్వరం, చలి, నీరసం, గొంతు మంట, ఒంటి నొప్పులు, నోరు చేదుగా ఉండ టం, వాసన తెలియకపోవడం, తలనొప్పి ముక్కు నుంచి నీరు కారడం వంటి లక్షణాలు కనిపిస్తే కొవిడ్ పరీక్షలు చేయించుకోవాలని ఆరోగ్యశాఖ సూచించింది. కొవిడ్ కేసులు ప్రబలిన దేశాల నుంచి ప్రయాణం చేసి వచ్చే వారు తప్పనిసరిగా కరోనా పరీక్షలు చేయించుకోవాలని తెలిపింది.

**ఆందోళన అవసరం లేదు**

కొవిడ్-19పై ప్రజలు ఆందోళన చెందవద్దు. ప్రస్తుతం సర్క్యులేట్‌లో ఉన్నది ఒమిక్రాన్ రూపంలో ఉన్న జేఎన్1 వేరియంట్. ఇది అంత ప్రమాదకారి కాదు. ఈ వేరియంట్ బారిన పడిన వృద్ధులు, ఇతర దీర్ఘకాలిక ఆరోగ్య సమ స్యలు ఉన్న వారు ఆస్పత్రిలో చేరి చికిత్సలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నా, ఇతరులకు పెద్ద హాని కలిగించే శక్తి ఉండదు. అనుమానిత లక్షణాలతో వచ్చే రోగుల కోసం ప్రభుత్వాస్పత్రిలో ప్రత్యేక కొవిడ్ ఓపీ, 15 పడకలతో ఐసోలేషన్ వార్డు ఏర్పాటు చేశాం.

డాక్టర్ రమణ యశస్వి, జీజీహెచ్ సూపరింటెండెంట్

## సన్నబియ్యంతో భోజనం

(3వ పేజీ తరువాయి)

దొడ్డ బియ్యానికి బదులు సన్న బియ్యం పంపిణీకి ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ఇప్పటికే ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి జిల్లా నుంచి ఇందుకు అవసరమైన ఇండెంట్‌ను పాఠశాల విద్యాశాఖ పౌరసరఫరాల శాఖకు పంపింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రభుత్వ జడ్పీ మండల పరిషత్ ఎయిడెడ్ పాఠశాలలు దాదాపు 6008పైగా ఉండగా 6.75 లక్షల మంది విద్యార్థులు ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యాభ్యాసం చేస్తున్నారు. బీసీ, గిరిజన, సాంఘిక సంక్షేమ శాఖ హాస్టళ్లు మరో 100 కిపైగా ఉన్నాయి. ఆయా హాస్టళ్లలో దాదాపు 8 వేల మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. గత ఏడాది నుంచి ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని 23 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించారు. పాఠశాల, కళాశాలల్లో మధ్యాహ్న భోజనానికి, వసతిగృహాల్లోని విద్యార్థులకు సన్నబియ్యాన్ని పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

**ధాన్యం సేకరించిన పౌరసరఫరాల శాఖ**

ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు, వసతిగృహాలకు అవసరాల నిమిత్తం రాష్ట్రస్థాయిలో ధాన్యం సేకరించి జిల్లాల వారీగా పంపిణీకి పౌరసరఫరాల శాఖకు ఏర్పాట్లు చేసింది. సన్న బియ్యం పక్కదారి పట్టకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ పరిస్థితుల్లో గోదాముల నుంచి డీలర్లకు పంపిణీ చేయకుండా నిర్దేశించిన పాఠశాలలకు, హాస్టళ్లకు నేరుగా సరఫరా చేయాలని నిర్ణయించింది. దాదాపు పదివేలకు పైగా మెట్రిక్ టన్నుల బియ్యం అవసరమని ప్రాథమిక అంచనా వేసినట్లు సమాచారం.

**ప్రతి ఒక్కరూ భోజనం చేసేలా..**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులందరూ భోజనం చేసేలా ఇప్పటికే మెనూలో మార్పులు తీసుకొచ్చారు. తాజాగా బియ్యం పంపిణీలో కూడా మార్పులు తీసుకు రానుండడంతో విద్యార్థులు ఎక్కువమంది భోజనం చేసే అవకాశం ఉంటుందని ప్రధానోపాధ్యాయులు చెప్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## జల్‌జీవన్‌లో.. జాగు

(3వ పేజీ తరువాయి)

ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. వైసీపీ ప్రభుత్వం వదిల్ల తాగునీటి పథకాల అభివృద్ధితో పాటు ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్లు ఇవ్వడంలో విఫలమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఈ పథకం పనుల్లో పురోగతి కనిపించడంలేదు. నిధులున్నా పనులు ముందుకు సాగడంలేదు. దీంతో గ్రామాల్లో రక్షిత నీటి పథకాలు సక్రమంగా పనిచేయడంలేదు. దీంతో అపరిశుభ్రమైన, ఫ్లోరైడ్ ఉన్న నీటిని అనేక ప్రాంతాల్లో ప్రజలు వినియోగించుకోవాల్సి వస్తోంది. తద్వారా ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నా పాలకులు, అధికారుల్లో చలనం లేదు.

- జల్‌జీవన్ మిషన్‌లో రాష్ట్రంలోనే పల్నాడు జిల్లా అట్టడుగున 26వ స్థానంలో ఉంది. రూ.508.16 కోట్లు అంచనాతో 1055 పనులు చేపట్టగా 219 పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. మూడో వంతు పనులు టెండర్ స్థాయి కూడా దాటలేదు. నిధుల విడుదలలో జాప్యం జరుగుతుండటంతో కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేసేందుకు ముందుకు రావడంలేదు. కేవలం 16 గ్రామాల్లోనే నూరు శాతం గృహాలకు కుళాయి కనెక్షన్ ఇచ్చినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ వెల్లడించింది.
- బాపట్ల జిల్లా జలజీవన్ అమలులో రాష్ట్ర స్థాయిలో 25వ స్థానంలో ఉంది. జిల్లాలో 19.82 శాతం నుంచి 40.84 శాతానికి కుళాయిల సంఖ్య పెరిగింది. రూ.205.22 కోట్ల అంచనాతో చేపట్టిన 723 పనుల్లో 223 మాత్రమే పూర్తయ్యాయి. 10 గ్రామాల్లో మాత్రమే నూరు శాతం కుళాయిలు ఇచ్చారు.
- గుంటూరు జిల్లాలో జలజీవన్ అమల్లోకి వచ్చిన అనంతరం 33,731 గృహాలకు కొత్తగా నీటి కుళాయిలు ఇచ్చారు. రాష్ట్రంలో జిల్లా 15వ స్థానంలో ఉంది. 308 పనులు చేపట్టగా 172 పూర్తయ్యాయి. 28 గ్రామాల్లో నూరు శాతం కుళాయిలు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

## రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే చర్యలు : సీఐ



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ శ్రీకాంత్‌బాబు

నాగులుప్పలపాడు, మే 30 (ఆంధ్రజ్యోతి): అమ్మనబ్రోలులో ప్ర స్తుతం నెలకొన్న పరిస్థి తుల దృష్ట్యా ఎవరైనా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చే సినా, వ్యవహరించినా చట్టపరమైన చర్యలు తప్పవని ఒంగోలు రూ రల్ సీఐ శ్రీకాంత్‌బాబు హెచ్చరించారు. అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన ముప్పవరపు వీరయ్యచౌదరి హత్యకేసులో నిందితుల్లో ఒకరైన వీరంరెడ్డి దేవేంద్రనాథ్‌చౌదరి వర్గీయులు రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తున్నారని వీ రయ్యచౌదరి వర్గీయుల ఫిర్యాదు మేరకు శుక్రవారం స్థానిక గ్రామ సచి వాలయం వద్ద ఇరువర్గాలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఒకరిపై ఒకరు దూషణలు, వ్యక్తిగత విమర్శలు, రెచ్చ గొట్టే వ్యాఖ్యలు చేసుకొంటూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చ ర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. శాంతియుతంగా, సంయమనంగా వ్యవహరించాలని హితవు పలికారు. ఇరువర్గాలకు చెందిన పలువురిని బైండోవర్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ రజియాసుల్తానా పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ మంజూరుపత్రం అందజేత

కొండపి, మే 30 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతూ శస్త్ర చికిత్స చేయించుకున్న మండలంలోని గోగినేనివారిపాలెం గ్రామానికి చెం దిన బొద్దపాటి శేషమ్మకు సీఎంఆర్ఎఫ్ కింద రూ.80లక్షలు మంజూరైంది. అందుకు సంబంధించిన పత్రాన్ని ఒంగోలులోని తన కార్యాలయంలో ఎం పీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, శేషమ్మ కుమారుడు సురేష్‌కు శుక్రవారం అందజేశారు. టీడీపీ నాయకుడు బీఎల్‌నరసింహం పాల్గొన్నారు.

## పీడీసీసీబీ ఛైర్మన్‌గా సీతారామయ్య నేడు బాధ్యతలు



ఒంగోలు(ఆంధ్రజ్యోతి), ఒంగోలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (పీడీసీసీబీ) పర్సన్ ఇన్‌చార్జి (ఛైర్మన్)గా డాక్టర్ కామేపల్లి సీతారామయ్య శనివారం అధికారికంగా బాధ్యతలు తీసుకోనున్నారు. ఇటీవల పర్సన్ ఇన్‌చార్జిగా ఆయన పేరును టీడీపీ అధిష్ఠానం ఖరారు చేసిన విషయం విదితమే. ఆమేరకు ప్రభుత్వం అధికారికంగా గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. శుక్రవారం సహకార శాఖ అధికారుల నుంచి ప్రత్యేక ఉత్తర్వులు జిల్లాకు వచ్చాయి. దీంతో శనివారం బ్యాంకుకు వెళ్లి సీతారామయ్య బాధ్యతలు స్వీకరించనున్నారు. సింగిల్ విండోల్లో ముగ్గురు సభ్యులతో కమిటీలను నియమిస్తున్న ప్రభుత్వం సెంట్రల్ బ్యాంకుకు ఛైర్మన్‌తోపాటు ఆరుగురిని బోర్డు సభ్యులుగా నియమించాల్సి ఉంది. మిగిలిన సభ్యుల నియామకంపై తదుపరి ఉత్తర్వులు రానున్నాయి. ఆతర్వాత సీతారామయ్య, మంత్రులు, ఉమ్మడి జిల్లాకు చెందిన టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులను ఆహ్వానించి మరోసారి ఆట్టహాసంగా బాధ్యతలు స్వీకరించాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది.

## పండ్లతోటల పెంపకానికి సబ్సిడీ రుణం

ఒంగోలు(రూరల్),మే30 (ఆంధ్రజ్యోతి): పండ్లతోటలు పెంపకానికి వందశాతం సబ్సిడీతో రుణం అందిస్తున్న ఉద్యానశాఖ అధికారి డి.ప్రత్యూష అన్నారు. శుక్రవారం ఒంగోలులో జరిగిన సమావేశంలో ఆమె మా ట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా పండ్లతోటల పెంపకం చేపట్ట లని కోరారు. కార్యక్రమంలో ఏవో కిషోర్‌బాబు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్ల పరిశీలన

ఒంగోలు క్రైం, మే 30(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలోని పలు చోట్ల ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక కమ్మపాలెంలో ఉన్న ట్రాన్స్ ఫార్మర్ల భద్రతను స్వయంగా పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. అదేవిధంగా అక్కడ ఏర్పాటు చేసిన మీటర్లను తనిఖీలు చేపట్టారు. అదేసమయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తు న్న పీఎం సూర్యఘర్ పథకం లబ్ధిదారులతో మాట్లాడారు. కార్యక్రమంలో డీఈ పాండురంగారావు, ఏఈ సంతోష్ పాల్గొన్నారు.



ఫీడ్‌బాక్స్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ వెంకటేశ్వర్లు

# మహిళ మరింత దర్జాగా..!

## ఆగస్టు 15 నుంచి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం



- సూపర్ సిక్స్‌లో మరో హామీ అమలు దిశగా అడుగులు
- సీఎం ప్రకటనతో సర్వత్రా హర్షం
- జిల్లాలో 13 లక్షల మందికి లబ్ధి

ఒంగోలు, కార్పొరేషన్, మే 30 (ఆంధ్రజ్యోతి): నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చింది. ఇప్పటికే పింఛన్ల పెంపుపై తొలి సంతకం చేయగా, ఇటీవల ఉచిత సిలిండర్ల పంపిణీ పథకాన్ని అమలు చేసింది. తాజాగా కడపలో జరిగిన టీడీపీ మహానాడు వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మహిళలకు మరో శుభవార్త చెప్పారు. ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి రాష్ట్రంలోని మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు ప్రకటించారు. ఒకవైపు లోటు బడ్జెట్, ప్రభుత్వ ఖజానాపై భారం పడుతున్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. జిల్లాలో సుమారు 26లక్షల మంది వరకు జనాభా ఉన్నారు. అందులో సగానికిపైగా మహిళలే ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఆ ప్రకారం 13లక్షల మంది మహిళలకు రాష్ట్రంలో ఎక్కడికైనా బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశం లభించనుంది.

**ఆర్టీసీపై ఆర్థిక భారం.. అయినా అమలు**

ప్రకాశం రీజియన్‌లో ఒంగోలు, మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు, పొదిలి డిపోలు ఉన్నాయి. వాటి పరిధిలోని 866 గ్రామాలకు అనుసంధానంగా 20 బస్ స్టేషన్లు ఉన్నాయి. అలాగే 484 ఆర్టీసీ బస్సులు ఉండగా వాటిలో 95 అద్దె ప్రాతిపదికన (హయ్యర్) నడుస్తున్నాయి. ఈ బస్సులన్నీ రోజుకు 2లక్షల కిలోమీటర్లు ప్రయాణికుల కోసం రాకపోకలు సాగిస్తున్నాయి. అందులో 1.5లక్షల మంది ప్రయాణిస్తున్నారు. దీంతో రోజుకు రీజియన్‌కు రూ.77.51లక్షల ఆదాయం వస్తోంది. అందులో సగం మంది మహిళలు ఉన్నారు. వారికి ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అందించనుండటంతో రోజుకు రూ.38.50 లక్షల భారం ప్రభుత్వంపై పడనుంది.

## అవీ..ఇవీ..

### మోటార్‌సైకిల్‌ను ఢీకొన్న కారు

దంపతులు, మనుమడికి గాయాలు



గాయపడ్డ నూతలపాటి శ్రీనివాసరావు, ఆదిలక్ష్మి

అద్దంకి,మే30(ఆంధ్రజ్యోతి): మోటారు సైకిల్‌ను కారు ఢీకొనడంతో ముగ్గురు వ్యక్తులకు గాయాలైన ఘటన మండలంలోని నామ్ రోడ్డుపై శుక్రవారం చోటుచేసుకొంది. మోదేపల్లికి చెందిన నూతలపాటి శ్రీనివాసరావు, దంపతులు శుక్రవారం మణికేశ్వరంలో ఉన్న గర్భవతి అయిన కోడలు వద్దకు వెళ్లారు. తిరిగి మోటార్‌సైకిల్ పై మనవడు లోహిత్ కుమార్‌ను తీసుకొని దంపతులు అద్దంకి వైపు వస్తున్నారు. నామ్ రోడ్డు లో కొంగపాడు క్రాస్ రోడ్డు సమీపంలో వెనుక నుంచి వస్తున్న కారు వీరి మోటారు సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాసరావు, ఆదిలక్ష్మి దంపతులు, టమనుమడు లోహిత్‌కుమార్‌లు గాయపడ్డారు. వీరిని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం లోహిత్‌కుమార్‌ను ఒంగోలు వైద్యశాలకు తరలించారు.

### కుట్టుమిషన్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



కుట్టుమిషన్ శిక్షణను పరిశీలిస్తున్న ఎంపీడీవో కుసుమకుమారి

బల్లికురవ. మే 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం మహిళలు స్వశక్తితో జీవనం సాగించేలా ఉచితంగా కుట్టుమిషన్ శిక్షణ అందిస్తోందని ఎంపీడీవో కుసుమకుమారి పేర్కొన్నారు. శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల కేంద్రం బల్లికురవలో రెండు బ్యాచ్‌లుగా జరుగుతున్న శిక్షణను ఎంపీడీవో శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా శిక్షణ తీసుకుంటున్న మహిళకు ఎంపీడీవో పలు సూచనలు చేశారు. కుట్టుమిషన్ క్రమశిక్షణతో నేర్చుకోవాలన్నారు. క్రమం తప్పకుండా మహిళలు హాజరుకావాలన్నారు. శిక్షణ అనంతరం బీసీ కార్పొరేషన్ ద్వారా ధ్రువీకరణపత్రం మిషన్ అందజేస్తామన్నారు. మూడు మాసాల పాటు శిక్షణ ఏర్పాటు చేస్తున్నామన్నారు.

### వాహన చోదకులకు లైసెన్స్‌లు తప్పనిసరి



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ నాగరాజు

బల్లికురవ. మే 30 (ఆంధ్రజ్యోతి) : లైసెన్స్‌లు లేకుండా ఎవరైన వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్ఐ వై. నాగరాజు హెచ్చరించారు. శుక్రవారం బల్లికురవ సంతమాగులూరు రోడ్డులో ఎస్ఐ పలు వాహనాలను తనిఖీలు చేశారు. ఈసందర్భంగా లైసెన్స్‌లు లేకుండా వాహనాలను నడుపుతున్న వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం పలువురికి అపరాధ రుసుము విధించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే సంబంధిత వాహనదారులపై కేసులు నమోదు చేస్తామన్నారు.

### గ్రామస్థుల సహకారంతో సీసీ కెమెరాల ఏర్పాటు

బల్లికురవ. మే 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెన్నుపల్లి గ్రామంలో గ్రామస్థుల సహకారంతో పోలీసు శాఖ ఐదు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించింది. గ్రామానికి నలువైపులా ఈ కెమెరాలను అమర్చారు. కొత్త వ్యక్తులు గ్రామంలోనికి వస్తే నిఘా ఉంచడానికి బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై నిఘా ఉంచేలా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని ఎస్సై నాగరాజు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేలా చర్యలు చేపడుతున్నామన్నారు.



గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

### నేడు అత్యవసర సర్వసభ్య సమావేశం

చినగంజాం, మే 30(ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఉదయం 11గంటలకు అత్యవసర సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అద్దంకి శ్రీనివాసమూర్తి తెలిపారు. ఎంపీపీ కోమట్ల అంకమ్మరెడ్డి అధ్యక్షతన మండల పరిషత్ నందు వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై అత్యవసర సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి జడ్పీటీసీ సభ్యురాలు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు, గ్రామసర్పంచ్‌లు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

# చిట్టడవులను తలపిస్తున్న పేదల కాలనీలు

- నాడు జగన్న కాలనీలు.. నేడు ఎన్‌టీఆర్ నగర్
- పేరు మారినా మారని తలరాత
- కాలనీలలో మౌలిక వసతుల కరువు

అద్దంకి,మే30(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో పేదలకు ఇళ్ల పేరిట ఎంతో హడావుడి చేసినా, జగనన్న కాలనీలలో కనీస వసతులు కూడా లేవు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జగనన్న కాలనీలను ఎన్‌టీఆర్ నగర్‌లుగా మార్పు చేశారు. అయితే నేటికీ ఆ కాలనీల్లో మౌలిక వసతులు మాత్రం కల్పించలేదు. దీంతో పేరు మార్పు తప్పా మౌలిక వసతులు లేవని అక్కడి పేదలు వాపోతున్నారు.

అద్దంకి పట్టణంలో నాగులపాడు రోడ్డు, వేలమూరి పాడురోడ్డు, బొమ్మనంపాడురోడ్డులలో ఎన్‌టీఆర్‌నగర్‌లు ఉన్నాయి. బొమ్మనం పాడు రోడ్డులోని ఎన్‌టీఆర్ నగర్‌లో సుమారు వెయ్యి మందికి స్థలాలు కేటాయించారు. వీటిలో కేవలం పదుల సంఖ్యలోనే నివాసం ఉంటున్నారు. అద్దంకి పట్టణానికి సుమారు 4 కి.మీ దూరంలో ఉండటం ప్రధాన కారణం కాగా కాలనీలో సరైన నీటి వసతి లేకపోవడంతో ఇళ్ల నిర్మాణానికి సుముఖత చూపడం లేదు. అయినప్పటికీ, కొద్ది మంది నివాసం ఉంటున్నా చుట్టూ చుట్టూ చిట్టడవిని తలపించేలా చెట్లు పెరగడంతో వారు బిక్కు బిక్కుమంటూ కాలం వెల్లదీయాల్సిన పరిస్థితి ఉంది. ఇక నాగులపాడు రోడ్డులోని ఎన్‌టీఆర్‌నగర్‌లో సగం మందికి పైగా నివాసాలు ఉంటున్నప్పటికీ, అంతర్గత రోడ్లు మొత్తం చిల్లచెట్లతో నిండిపోయాయి. దీంతో రాకపోకలు సాగించేందుకు స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. దీనికి తోడు పాముల సంచారం ఎక్కువగా ఉంటోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేలమూరి పాడు రోడ్డులోని ఎన్‌టీఆర్ నగర్‌లో అత్యధిక ప్లాట్లలో ఇళ్ల నిర్మాణం పూర్తయ్యింది. ఇక్కడ ప్రజలు నివసిస్తు న్నారు. అయినప్పటికీ, అంతర్గతంగా సైడ్‌డ్రైన్లు, రోడ్లు లేవు. దీంతో చినుకు పడితే ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం దృష్టిసారించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ రవీంద్రను వివరణ కోరగా, ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు అయిన వెంటనే మౌలిక వసతుల కల్పన చేపడతామన్నా రు. ముందుగా బొమ్మనంపాడు రోడ్డులోని ఎన్‌టీఆర్‌నగర్‌కు నీటివసతి కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. అనంతరం చిల్లచెట్ల తొలగింపునకు చర్యలు చేపడతామన్నారు.



బొమ్మనంపాడురోడ్డులోని కాలనీలో అధ్వానంగా ఉన్న రహదారి



నాగులపాడు రోడ్డులోని ఎన్‌టీఆర్ నగర్‌లో పెరిగిన తుమ్మచెట్లు

# నల్లబర్లీ రైతులను ఆదుకోవాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

పంగులూరు, మే 30(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం నల్లబర్లీ పొగాకు రైతుల కష్టాలు తీర్చేదిశగా చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కనిపించడం లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. మండలంలోని జనకవరం గ్రామంలో శుక్రవారం నల్లబర్లీ కౌలు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసంబద్ధ విధానాలతో వ్యవసాయం గాలిలో దీపంగా మారిందన్నారు. నల్లబర్లీ కొనుగోలు విషయంలో కంపెనీలు ప్రభుత్వ నిర్ణయాల ను పాటించే విధంగా కనిపించడంలేదన్నారు. వ్యవసాయం జూదంగా మారిందని, ఇందులో రైతులు పావులుగా మారుతున్నారని విమర్శించారు. నల్లబర్లీ పొగాకు సాగు చేసే విధంగా జీపీఐ ఐటీసీ కంపెనీలు రైతాంగాన్ని ప్రోత్సహించాయన్నారు. నేడు ఆ కంపెనీలు కంటికి కనిపించకుండా, పొగాకు కొనుగోలు చేయకుండా రైతాంగాన్ని మోసం చేస్తున్నాయన్నారు. గిట్టుబాటు ధర కల్పించి పంటను కొనుగోలు చేస్తే రైతులు ఎందుకు ఆత్మహత్యలు చేసుకుంటారని ప్రశ్నించారు. మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు చేయిస్తామని చెప్పిన మాటలు ఆచరణకు నోచుకోవడం లేదన్నారు. కంపెనీలతో తక్షణమే నల్లబర్లీ పొగాకు కొను గోళ్లు చేయించేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

**రైతు కుటుంబానికి పరామర్శ**

అప్పులబాధతో గ్రామంలో ఆత్మహత్య చేసుకున్న యువరైతు తలపనేని శ్రీనాథ్ కుటుంబాన్ని పార్టీ నేతలతో కలసి పరామర్శించారు. బాధిత కుంటుబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని డిమాండ్ చేశారు. శ్రీనాథ్ భార్యకు ఉపాధి చూపాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి గంగయ్య, రైతుసంఘం కార్యదర్శి తలపనేని రామారావు, కౌలు రైతుసంఘం కార్యదర్శి వినోద్‌బాబు, కందిమళ్ల రామకోటేశ్వరరావు, మల్లారెడ్డి, తలపనేని సుబ్బారావు, రఘుచంద్, ఎడ్ల రవి, రామచంద్రరాజు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

# సర్వసభ్య సమావేశంలో ప్రగతి నివేదికల వెల్లడి

సంతమాగులూరు మే 29( ఆంధ్రజ్యోతి) : మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ వై.ఎలమంద అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధశాఖల అధికారులు ప్రగతి నివేదకలు చదివి వినిపించారు. తహసీల్దార్ కే.రవిబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎండీయూ వాహనాలను రద్దు చేసిందన్నారు. దీంతో నిత్యవసర సరుకులను జూన్ నెల ఒకటవ తేదీ నుంచి రేషన్ డీలర్లు సరుకులను సరఫరా చేస్తారని వివరించారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం నాలుగు గంటల నుండి రాత్రి 8 గంటల వరకు డీలర్లు సరుకులను పంపిణీ చేస్తారన్నారు. 65 సంవత్సరాలు దాటిన వారికి, దివ్యాంగులకు ఇంటివద్దకే డీలర్లు సరుకులను సరఫరా చేస్తారన్నారు. నిత్యవసర సరుకులు సక్రమంగా పంపిణీ జరిగేందుకు ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. ఏవో లావణ్య మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ మొదలైనందున రైతులకు పచ్చి రొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. మొక్కజొన్న పైరుకు కనీస మద్దతు ధర ఉండడంతో ఈ ఏడాది రైతులు మొక్కజొన్న పైరు సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. రైతులు ఆధీకృత డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. కౌలు రైతులందరూ కార్డులు పొందాలన్నారు. పీఆర్ ఏఈ నాగేశ్వరరావు మాట్లాడుతూ డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ కింద సీసీ రోడ్లు నిర్మించేందుకు మండలానికి రూ.1.60 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఎంపీడీవో జ్యోతిర్మయి మాట్లాడుతూ యోగాంధ్రలో భాగంగా విశాఖపట్నంలో ఐదు లక్షల మందితో యోగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీని కోసం మండలం నుంచి ఇప్పటికే 8500 మందిని రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలిపారు. సర్వసభ్య సమావేశానికి విద్యుత్, అటవీ, ఆర్టీసీ, రవాణాశాఖ అధికారులు హాజరుకాలేదు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# జగన్‌ను విమర్శించడానికే మహానాడు

వైసీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున

చీరాల, మే 30 (ఆంధ్రజ్యోతి) : కడపలో టీడీపీ నిర్వహించిన మహానాడులో మాజీ ముఖ్యమంత్రి జగన్‌పై విమర్శలు చేయడానికి మినహా ప్రజలకు ఒరిగిందేమీ లేదని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి మేరుగ నాగార్జున, చీరాల నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్‌లు విమర్శించారు. శుక్రవారం నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. పొగాకు, మిర్చి, పత్తి, వరి తదితర పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. ఒకవైపు రాష్ట్రంలో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతుంటే మరొక వైపు ముఖ్యమంత్రి మహానాడుతో సొంత ప్రచారం చేసుకొంటున్నారని ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వం ప్రజల భవిష్యత్తు కోసం పాటుపడిందన్నారు. ఈ క్రమంలో వైసీపీ అధిష్ఠానం ఆదేశాల మేరకు జూన్ 4న వెన్నుపోటు దినంగా భావించి నియోజకవర్గ కేంద్రాల్లో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ అధికారులకు వినతిపత్రాలు అందజేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు బొనిగల జైసన్‌బాబు, బత్తుల అనీల్, కంపా అరుణ్, చీమకుర్తి బాలకృష్ణ, గవిని శ్రీనివాసరావు, యాతం మేరీబాబు, డా.ఐ బాబురావు, వాసు, కావూరి రమణారెడ్డి, పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున

# మత్స్యకార, యానాదుల కుటుంబాలకు అండగా ఉంటా

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, మే 30 (ఆంధ్రజ్యోతి) : కడలని నమ్మి జీవనం సాగించే, మత్స్యకార యానాదుల కుటుంబాలకు అండగా ఉంటానని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కొండయ్య పేర్కొన్నారు. శుక్రవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గం పరిధిలోని యానాదులకు సొసైటీ గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో సుమారు 8 మండలాల్లో యానాదులు వేటపై ఆధారపడి జీవనం సాగిస్తున్నట్లు వివరించారు. అయితే వీరికి ఇంతవరకు ఎక్కడా కూడా సొసైటీ గుర్తింపుకార్డులు లేవని చెప్పారు. వారి జీవనమనుగడకు ప్రయోజన కరంగా ఉండేందుకు గుర్తింపు కార్డులు అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ కౌతవరపు జనార్ధనరావు, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు తిరుమలశెట్టి శ్రీను, మాజీ ఎంపీపీ నాదెండ్ల కోటేశ్వరరావు, ఏసుదాసు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



గుర్తింపుకార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చినగంజాం, మే 30 ఆంధ్రజ్యోతి) : చినగంజాం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని కడవకుదురు గ్రామంలో శనివారం ఉదయం 8గంటల నుండి సాయంత్రం 3గంటల వరకు తాత్కాలికంగా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈఈ పి.గణనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో నూతన విద్యుత్ లెన్లు ఏర్పాటు చేస్తుండడంతో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

### విద్యుత్ అంతరాయంపై కదిలిన అధికారులు

పంగులూరు, మే 30(ఆంధ్రజ్యోతి): రామకూరు గ్రామంలో ప్రతి అరగంటకు విద్యుత్ సరఫరాలో కలుగుతున్న అంతరాయంపై అధికారులు స్పందించారు. రామకూరు గ్రామంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం పేరుతో 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో వరపర్ల ఫీడర్‌లో శ్రీనివాస స్టోన్‌క్రషర్ వద్ద ఇన్సిలేటర్లలో లోపాన్ని గుర్తించిన అధికారులు సంబంధిత సిబ్బందితో సమన్వయం చేసుకొని దిద్దుబాటు చర్యలు చేపట్టారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాన్ని తొలగించినట్లు ఏఈ అనిల్‌కుమార్ తెలిపారు.

### బస్సు నుంచి జారిపడి, మహిళకు గాయాలు

అద్దంకి,మే30(ఆంధ్రజ్యోతి): మండలంలోని చక్రాయపాలెం వద్ద ఆర్టీసీ బస్సులో నుంచి జారి పడి మహిళకు గాయాలయ్యాయి. బాధితురాలి కథనం మేరకు బల్లికురవ మండలం కొత్తూరులోని అరుణగిరి తండాకు చెందిన మారుణీభాయ్ శుక్రవారం అద్దంకి నుంచి వి.కొప్పెరపాడుకు వెళ్లేందుకు బస్సుఎక్కింది. అయితే తాను బస్సు దిగే కొప్పెరపాడు వచ్చిందనే ఆలోచనతో చ క్రాయపాలెం వద్ద దిగేందుకు ప్రయత్నించి, క్రమంలో జారి కిందపడింది. గాయాలైన మారుణీభాయ్‌ను అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



గాయపడ్డ మారుణీభాయ్

### ప్రజాదర్బార్‌కు 85 అర్జీలు

చీరాల, మే 30 (ఆంధ్రజ్యోతి) : కొంతకాలంగా నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కొండయ్య ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రజాదర్బార్‌కు అర్జీలు వెల్లువెత్తుతున్నాయి. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు శుక్రవారం క్యాంపు కార్యాలయంలో టీడీపీ కూటమి నేతలు అర్జీలు స్వీకరించారు. ప్రజల నుంచి ఆయనకు 85 అర్జీలు అందాయి. వీటిల్లో 21 పెన్షన్, నివేశన స్థలాలు 49, ఇతర సమస్యలు 15 ఉన్నాయి.

### లేబర్‌కోడ్ రద్దుకు కార్మికుల డిమాండ్

పేరాల(చీరాల), మే 30 (ఆంధ్రజ్యోతి) : లేబర్‌కోడ్స్ వలన కార్మికులకు తీరని నష్టం జరుగుతుందని దీనిని వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ ప్రతినిధులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. ఎన్నోపోరాటాలతో సాధించుకున్న హక్కులను కేంద్రప్రభుత్వం కాలరాస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో ఎం.వసంతరావు, ఎస్.బాబురావు, క్రాంతిసాగర్, యేసురత్నం, సింగయ్య, సురేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### క్వాలిటీ కంట్రోల్ అధికారుల తనిఖీ



కాలువల నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

బల్లికురవ. మే 30 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం ద్వారా ఇటీవల గ్రామాలలో చేపట్టిన సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్ల పనులను జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారులు శుక్రవారం తనిఖీలు చేశారు. బల్లికురవ. అంబడిపూడి, ఉప్పుమాగులూరు, సోమవరప్పాడు, వెలమవారిపాలెం గ్రామాలలో రూ.90 లక్షల నిధులతో నిర్మించారు. సిమెంట్ రోడ్లు, మురికి కాలువల పనులను నాణ్యతపై యంత్రాల ద్వారా తనిఖీ చేశారు. నాణ్యత తక్కువ ఉంటే బిల్లుల చెల్లింపులు నిలిపి వేస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు. బల్లికురవ మండలంలో చేపట్టిన రోడ్లు నాణ్యతగా ఉన్నాయని వారు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ తనిఖీలలో క్వాలిటీ కంట్రోల్ ఈఈ ఎంవీ శ్యాంప్రసాద్, విజిలెన్స్ ఏఈ సీహెచ్ శ్రీనివాస్, స్థానిక ఏఈ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.





### యోగాసనాలతో మానసిక ప్రశాంతత

చీరాల, మే 30 (ఆంధ్ర జ్యోతి) : ప్రతిఒక్కరూ యోగాసనాలు సాధన చేయడం ద్వారా మానసిక ప్రశాంతతో పాటు ఆరోగ్యంగా జీవిస్తారని మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జూన్ 21 వరకు స్థానిక అంబేడ్కర్ భవనంలో ప్రతిరోజు ఉదయం 6:30 గంటల నుంచి గంట పాటు యోగా శిక్షణ నిర్వహిస్తున్నట్లు వివరించారు. సచివాలయ సిబ్బంది. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సూచించారు.

పంగులూరు : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని, ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా యోగాను అభ్యసించాలని మండల ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ కృష్ణకుమార్ అన్నారు. పంగులూరు మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం అధికారులు, సిబ్బంది యోగా సాధన చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణకుమార్ సిబ్బందితో ఆసనాలు వేయించి ఒక్కో ఆసనంతో కలిగే ప్రయోజనాలను సిబ్బందికి వివరించారు. శారీరక, మానసిక ఆరోగ్యానికి దోహదపడే యోగా ప్రతి వ్యక్తి జీవితంలో భాగం కావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో స్వరూపారాణి, కార్యాలయ ఏవో రమేష్, సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.



పంగులూరులో యోగాసనాలు వేస్తున్న అధికారులు

### ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం డిమాండ్



ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు

చీరాల, మే 30 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి పసుమర్తి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. జూన్ 5న ఛలోవిజయవాడ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలో ఇరిగేషన్ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న 14 రకాల సమస్యలు పరిష్కరించాని కోరుతూ 3న విజయవాడలో కౌన్సిల్ సమావేశం జరుగుతుందన్నారు. అలాగే 5న జరిగే ఛలో విజయవాడను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక అధ్యక్షులు వినోద్, కార్యదర్శి శ్రీనివాసరావు తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

### లక్ష్యసాధనలో ప్రజలు భాగస్వామ్యం కావాలి

- ఎంపీడీవో స్వరూపారాణి



గ్రామసభలో స్వర్ణాంధ్ర లక్ష్యాలను వివరిస్తున్న ఎంపీడీవో స్వరూపారాణి

పంగులూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం నిర్దిష్ట ప్రణాళికతో చేపట్టిన స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఎంపీ డీవో స్వరూపారాణి అన్నారు. మండలంలోని జనకవరం, కశ్యాపురం, ముప్పవరం, జార్లమూడివారిపాలెం గ్రామాలలో శుక్రవారం గ్రామ సభలు నిర్వహించారు. గ్రామంలో సేకరించే తడి, పొడి చెత్త వేరుచేసే విధానం, పీఎం సూర్యఘర్ పథకం, ప్రయోజనాలు, యోగాంధ్ర కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పచ్ తలపనేని వీరమ్మ, దూళిపాళ్ల వెంకట్రావు, సాంబశివరావు, వెంకాయమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు గుర్రం కల్యాణి, ఏపీఎం జ్యోతి ప్రసాద్, కార్యదర్శి రాంబాబు, సునీత, జానీబేగం, మల్లికార్జు, సచివాయ సిబ్బంది, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.